నవతెలంగాణ 1
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
ఆదివారం 25 జూన్ 2023

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

నవతెలంగాణ కొండపాక



రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందిన సంఘటన కొండపాక మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై పుష్పరాజ్ తెలిపిన వివరాల ప్రకారం... చిన్న కిస్టాపూర్ స్టేజి వద్ద రాజీవ్ రహదారిపై శనివారం కుకునూరుపల్లి గ్రామానికి చెందిన పర్వతం నర్సయ్య(70) మోపెడుపై వెళ్తుండగా హైదరాబాద్ వైపు వెళుతున్న జనగామ డిపో బస్సు అతన్ని ఢీ కొట్టింది. దీంతో నర్సయ్య కిందపడి పోయాడు. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని గజ్వేల్ ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం రాత్రి లకుడారం స్టేజి వద్ద రాజీవ్ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టగా ఒక వ్యక్తి మృతి చెందాడు. సిద్దిపేటకు చెందిన అరుణ్ కుమార్ మోటార్ సైకిల్ పై సిద్దిపేట వైపు వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ పంపిణీ



నవ తెలంగాణ హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ మండలంలోని పందిళ్ళ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 100 మందికి విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తోడెటి రమేష్, ఎంపీటీసీ బాణాల జయలక్ష్మి, అంగన్వాడీ టీచర్ శారదా, భూలక్ష్మి, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు అశోక్, రాజశ్రీ, శంకర్ , ఉప్పరపల్లి సంపత్ నార్లపురం రజిత బొమ్మగాని రజిత తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీతో మొబైల్ స్వాధీనం



నవతెలంగాణ వర్గల్

ములుగు గ్రామానికి చెందిన తలారి రాజు, స్వామి ఇద్దరు తమ మొబైల్ ఫోన్లను ఈనెల 17న పోగొట్టుకున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన www.ceir.gov.in అనే వెబ్సైట్లో ఫోన్ ఐఎంఈఐ నెంబర్‌ను ఎంటర్ చేసి బ్లాక్ చేశారు. వెంటనే ఫోన్ దొరికిన వ్యక్తి దానిలో సిమ్ కార్డు వేసుకోవడంతో, ఈ వెబ్సైట్ ద్వారా అతని వివరాలతో కూడిన సమాచారం చేర్యాల పోలీసులకు చేరింది. సమాచారం అందుకున్న పోలీసులు ఫోన్ దొరికిన వ్యక్తి నుంచి ఫోన్ను స్వాధీనం చేసుకుని, పోగొట్టుకున్న వ్యక్తులకు అందజేశారు.


మాదిగలకు 13 అసెంబ్లీ స్థానాలు కేటాయించాలి



నవ తెలంగాణ - సిద్దిపేట

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలోని పార్టీలన్నీ మాదిగలకు 13 అసెంబ్లీ స్థానాలు, రెండు పార్లమెంట్ స్థానాలు కేటాయించాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్ మాదిగ డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఎమ్మార్పీఎస్ టీఎస్ డిమాండ్ల సాధన కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీల కోసం కేటాయించిన 18 అసెంబ్లీ స్థానాలు అత్యధిక జనాభా ఉన్న మాదిగలకు అధిక సీట్లను కేటాయించి రాజకీయ పార్టీలు తమచిత్త శుద్ధిని నిరూపించుకోవాలన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవ తీసుకొని కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని కోరారు. దళితులకు గృహ నిర్మాణం కోసం ప్రభుత్వ రూ.3 లక్షల సహాయాన్ని రూ.10 లక్షలకు పెంచాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గానికి 5 వేల మంది దళితులకు అమలు చేయాలన్నారు. డప్పు, చెప్పు మృత్తిదారులకు తక్షణమే రూ.రెండు వేల పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. డిమాండ్ల సాధన కోసం జూన్ 30న ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి పెద్ద ఎత్తున మాదిగ బంధువులందరూ హాజరు కావాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కాశపాక రాజేందర్ మాదిగ, జిల్లా అధ్యక్షులు భూమన్నగారి రాజేందర్, అధికార ప్రతినిధి దేవులపల్లి రాజేందర్, ప్రధాన కార్యదర్శి గడ్డం వెంకటేష్, జంగపల్లి సాయిలు, తిరుపతి, నాగభూషణం, రవి తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



నవతెలంగాణ హవేలీ ఘనాపూర్

హవేలి ఘనపూర్ మండల కేంద్రంలో సిడిపి నిధులు రూ.10 లక్షలతో సీసీరోడ్డు పనులను ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. సర్పంచ్ నోముల సవిత శ్రీకాంత్‌తో కలిసి జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో పాఠశాల ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ సూచించారు. సమీపంలోని పల్లె దవాఖానను సందర్శించి సిబ్బంది పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఇటీవల ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన పార్టీ సీనియర్ కార్యకర్త మూగ ఏసురాజు ఇంటికి వెళ్లి ఎమ్మెల్సీ పరామర్శించారు. ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం చేసి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నోముల సవిత శ్రీకాంత్ సర్పంచులు మహిపాల్ రెడ్డి, మన్నె లక్ష్మీనారాయణ, యామిరెడ్డి, రాజేందర్ రెడ్డి, పార్టీ నాయకులు శీను నాయక్, సాయ గౌడ్ చిట్యాల శ్రీనివాస్, మండల కోఆప్షన్ సభ్యుడు ఖాలేద్, స్థానిక ఉపసర్పంచ్ మోహన్ గౌడ్ వార్డు సభ్యుడు నాగరాజు, పార్టీ నాయకులు ప్రతాపరెడ్డి, నవీన్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, లక్ష్మయ్య గణపతి, శ్రావణ్, శ్రీను, రామ్, అభిరామ్, అశోక్ ఎంపీడీవో శ్రీరామ్, పంచాయతీ రాజ్ డిప్యూటీ ఈ పాండురంగారెడ్డి ఉన్నారు.

సత్య సూర్య పరిశ్రమలో వేతనం ఒప్పందం చేయాలి

- కార్మికులపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి
- సత్య సూర్య అల్యూమినియం ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సురేష్

నవ తెలంగాణ- గజ్వేల్

వర్గల్ మండలం గౌరారం గ్రామంలో గల సత్య సూర్య అల్యూమినియం ఇండస్ట్రీస్‌లో పని చేస్తున్న కార్మికులందరికీ వెంటనే వేతన ఒప్పందం చేయాలని, కార్మికులపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని యూనియన్ ప్రధాన కార్యదర్శి సురేష్ డిమాండ్ చేశారు. పరిశ్రమ వేతన ఒప్పందం త్వరగా చేయాలని నల్ల బ్యాడ్జీలతో పరిశ్రమ ముందు శనివారం నిరసన వ్యక్తం చేశారు. 2022 మార్చితో వేతనం ఒప్పందం పూర్తయిన మరల వేతన ఒప్పందం చేయకుండా కాలయాపన చేస్తూ కార్మికులపై వేధింపులకు పాల్పడుతూ మానసిక శోభకు గురి చేస్తోందన్నారు. నిత్యావసర సరుకుల ధరలు పెరిగి జీవన ప్రమాణాలు తగ్గిపోతున్నాయని అన్నారు. రోజురోజు కార్మిక కుటుంబాలకు ఖర్చులు పెరుగుతున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి నియోజకవర్గంలోని పరిశ్రమలో పని చేసిన కార్మికుల పరిస్థితి ఈ విధంగా ఉందని, పరిశ్రమ యాజమాన్యం కనీస కార్మిక చట్టాలు అమలు చేయకుండా లేబర్ చట్టాలకు విరుద్ధంగా పరిశ్రమలో ఘర్షణ వాతావరణ సృష్టిస్తోందని అన్నారు. పరిశ్రమలో వేతన ఒప్పందం వెంటనే చేయాలని, కార్మిక సమస్యలన్నీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రవిరాజు సుధాకర్ నరేష్ అశోక్ సద్దాం మల్లేష్ రాజు జయమ్మ లక్ష్మి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



జోరు వాన

- నైరుతి రుతుపవనాల ప్రభావంతో కురుస్తున్న వర్షాలు
- పత్తి విత్తే పనుల్లో అన్నదాతలు నిమగ్నం
- మెట్ట పంటల సాగుకు అదును, పదును
- ఊపందుకున్న విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లు
- ఉమ్మడి జిల్లాలో 8 లక్షల ఎకరాల్లో పత్తి సాగు



నైరుతి రుతుపవనాల ప్రభావంతో వానలు జోరందుకున్నాయి. దీంతో ఖరీఫ్ పంటల సాగు పనులు కూడా వేగంగా సాగుతున్నాయి. నెల ఆలస్యంగా వర్షాలు పడుతుండడంతో అన్నదాతలు అదును, పదును చేజారకుండా సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. జులై రెండో వారంలోపే మెట్ట పంటల సాగు పూర్తవాల్సి ఉండడంతో పత్తి, జొన్న, మొక్కజొన్న, కంది, పెసర ఇతర పంటల సాగు పనులు జోరుగా సాగుతున్నాయి. విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లు ఊపందుకున్నాయి. వానలు పడుతుండడంతో వ్యవసాయ పనులు ఒకేసారి వేగం పుంజుకున్నాయి. మెట్ట పంటలతో పాటు వరి సాగుకు కోసం రైతులు దుక్కులు దున్నే, నార్లు పోసే పనులు చేస్తున్నారు.

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా నైరుతిరుతుపవనాల ప్రభావంతో వానలు పడుతున్నాయి. రెండు మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ మొదలైన జూన్‌లో 21 రోజుల పాటు ఎండలు దంచికొట్టాయి. మెట్ట పంటలేసేందుకు వేసవి దుక్కులు దున్ని సాగుకు సిద్ధం చేసిన రైతులు వానల కోసం ఆకాశంవైపు ఎదురు చూశారు. జూన్‌లో వర్షాలు పడకపోతే సీజన్ చేజారి పోతుందని ఆందోళన చెందారు. నైరుతి రుతుపవనాలు ఆలస్యం కావడంతో రైతుల్లో ఆశలు సన్నగిల్లాయి. విత్తనాలు, ఎరువులు కూడా కొనేందుకు బయపడ్డారు. కాలం కాదేమో అన్న గుబులు వెంటాడింది. నైరుతి కాస్త ఆలస్యమైనా వానలు కురుస్తుండడంతో ఏ మాత్రం ఆలస్యం చేయకుండా రైతులతు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో అత్యధికంగా పత్తి సాగవుతుంది. ఈ రెండు జిల్లాల్లో రైతులు పత్తి విత్తనాలు వేసుకుంటున్నారు.

మూడు రోజులుగా వానలు

జూన్ ప్రారంభంలో రావాల్సిన నైరుతు రుతుపవనాలు ఆలస్యంగా వచ్చాయి. ఉమ్మడి జిల్లాలో మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. శనివారం సంగారెడ్డి జిల్లాలో పలు చోట్ల వర్షం కురిసింది. సిర్గాపూర్‌లో 31.6 మిల్లీ మీటర్లు, కల్హేర్‌లో 36.2 మిల్లీ మీటర్లు, నారాయణఖేడ్‌లో 24.6, మనూరులో 14.6, కంగ్టిలో 12, నిజాంపేటలో 10.3, నాగిల్‌గిద్దలో 13.2 మిల్లీ మీటర్ల వర్షం పడింది. న్యాల్‌కల్‌లో 21 మి.మీటర్ల వర్షం కురిసింది. జూన్‌లో సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాలో సాధారణ వర్షాపాతం 130-135 మిల్లీ మీటర్లు కాగా 20 రోజుల పాటు ఒక్క వాన కూడా పడలేదు.నెలంతా వానలు పడవేమో అనుకున్న వేళ చివరి వారంలో వానలు పడుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న మోస్తరు వానలు పంటల సాగుకు దోహదం చేస్తున్నాయి. సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ మూడు జిల్లాల్లో మోస్తరు నుంచి పెద్ద వానలు పడ్డాయి. ఈ నెలాఖరు వరకు వర్షాలు ఇలానే కురిస్తే ఖరీఫ్‌లో మెట్ట పంటల సాగు 90 శాతం పైనే పూర్తవ్వనుంది.

8 లక్షల ఎకరాల్లో పత్తి సాగు

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా పత్తి సాగు 8 లక్షల ఎకరాలకుపైనే సాగవ్వనుంది. సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో పత్తి సాగే ప్రధానమైన పంటగా ఉంది. మెదక్‌లో నామమాత్రంగానే పతి సాగు చేస్తారు. సంగారెడ్డి జిల్లాల్లో 3.60 లక్షల ఎకరాల్లో పత్తి సాగయ్యే అవకాశముందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇప్పటికే మునిపల్లి, సదాశివపేట, కొండాపూర్, సంగారెడ్డి, కంది, ఆందోల్, చౌటకూరు,, నారాయణఖేడ్, మనూరు, కోహీర్, ఝరాసంఘం, కంగ్టి వంటి మండలాల్లో పత్తి విత్తనాలు వేస్తున్నారు. మొదట్లో కొందరు పత్తి విత్తనాలేశారు. వానల్లేక అవి మొలకెత్తలేదు. ఈ వర్షాలతో మొలకలొస్తున్నాయి. మెదక్ జిల్లాలో 48 వేల ఎకరాల్లో పత్తి వేయనున్నారు. 3.50 లక్షల ఎకరాల్లో వరి సాగుతుంది. నీటి లభ్యత లేని టేక్మాల్, రామాయంపేట, కౌడిపల్లి, నార్సింగ్, నర్సాపూర్ వంటి ప్రాంతాల్లో కొద్దిమేరకే పత్తి సాగుచేస్తున్నారు. సిద్దిపేట జిల్లాలో 4 లక్షల ఎకరాల వరకు పత్తి వేస్తారు. ఇప్పటికే పత్తి విత్తనాలు వేసే పనులు షురూ అయ్యాయి. చేర్యాల, కొమురవెల్లి, గజ్వేల్, హుస్నాబాద్, దుబ్బాక, కొండపాక వంటి ప్రాంతాల్లో పత్తి విత్తనాలేస్తున్నారు.

పత్తి విత్తనాలేసుకుంటున్నం



కాలం కాదనుకున్నం. ఆలస్యంగా వానలు పడుతున్నాయి. అదును దాటితే సాగు కష్టమైతది. పత్తి విత్తనాలేసుకుంటున్నం. మెట్ట పంటలకు మంచి వానలు కురుస్తున్నాయి. పదెకరాల్లో విత్తనాలు వేసుకునే పనుల్లో ఉన్నం. ఇతర పంటల్ని కూడా ఇప్పుడే సాగు చేయాలి. ఎరువులు, విత్తనాల అడావుడి పెరిగింది. వరుణుడు కరునించడం సంతోషంగా ఉంది. పత్తి, కంది, ఇతర మెట్ట పంటల సాగుకు సరిపడ వర్షాలు కురుస్తున్నాయి.

– మాణిక్యప్ప, మేళసంఘం

అంచనా మేరకు సాగయ్యే అవశాం



ఖరీఫ్ సాగు ప్రణాళిక మేరకు పంటలు సాగయ్యే పరిస్థితులే ఉన్నాయి. జూన్‌లో వర్షాలు పడలేదు. దీంతో ముందస్తు ఖరీఫ్ సాధ్యపడలేదు. వానలు పడుతున్నందున అన్ని రకాల పంటలు సాగు చేసుంటున్నారు. వరి పంటలో దీర్ఘకాలిక రకాలు కాకుండా స్వల్పకాలిక రకాలేసుకుంటే యాసంగిలో అకాల వర్షాల నష్టముండదు. నూక శాతం తగ్గుద్ది. సంగారెడ్డి పత్తి, ఇతర మెట్ట పంటల సాగు పనులు పుంజుకున్నాయి. నీటి ఆధారంగా వరి సాగు పనులు జరుగుతున్నాయి.

– నర్సింహారావు, సంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి

గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

- జూలై 6 నుండి నిరవధిక సమ్మె
- జేఏసీ చైర్మన్ తునికి మహేష్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రవి కుమార్
- సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా

నవ తెలంగాణ సిద్దిపేట అర్బన్



'గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి. పంచాయతీ కార్మికులకు జీఓ 60 ప్రకారం వేతనాలు పెంచాలి. ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి వేతనాలు ఇవ్వాలి. మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలి. కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలి. ప్రమాదాల్లో మరణించిన కార్మికుల కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారం అందించాలి. పెండింగ్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలి' అని డిమాండ్ చేస్తూ శనివారం తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ తునికి మహేష్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవి కుమార్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జె.ఎ.సి. ఆధ్వర్యంలో జూలై 6 నుండి జరిగే రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 12,769 గ్రామ పంచాయతీలలో 50 వేల మంది గ్రామ పంచాయతీ సిబ్బంది పని చేస్తున్నారని తెలిపారు. పంచాయతీలలో కొత్తగా కార్మికులను గ్రామ పంచాయతీ తీర్మానంతో, డి.పి.ఓ ఆమోదం తర్వాతనే నియామకాలను చేపట్టాలన్నారు. అక్రమ నియామకాలను అరికట్టాలన్నారు. జీఓ నెం.51 తీసుకొచ్చి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని ప్రవేశ పెట్టారని తెలిపారు. బిజెపి ప్రభుత్వం స్వచ్ఛ భారత్ పేరుతో అట్టహాసంగా కార్యక్రమాలను ప్రారంభించి ఫొటోలకు ఫోజులిస్తూ వాటి యాడ్స్ కోసం వేల కోట్ల ప్రజా ధనాన్ని వృథా చేసిందన్నారు. బిజెపి ప్రభుత్వరంగ సంస్థలను పెట్టుబడిదారులకు కారుచౌకగా అమ్మేస్తుందన్నారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, ఫిక్స్ టర్మ్, డైలీవేజ్ తదితర రకాల పేర్లతో ఉపాధి పొందుతున్న కార్మికుల శ్రమను యథేచ్ఛగా దోచుకునేందుకు కనీసవేతన చట్టాన్ని అమలు చేయడం లేదన్నారు. అన్నదాతలకు కనీస మద్దతు ధరను నిర్ణయించడం లేదన్నారు. డీజిల్, పెట్రోల్, వంట గ్యాస్, ఇతర నిత్యావసర సరుకుల ధరలు పెంచి ప్రజల నడ్డి విరిచిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీరు మరీ దారుణమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు అమ్ముల బాలనర్సయ్య, జేఏసీ జిల్లా నాయకులు బాకీ యాదగిరి, బాలనర్సావ్వ, పార్వారములు, రాజమౌళి, అండాలు, నరేష్ పాల్గొన్నారు.



గ్రామపంచాయతీ కార్మికుల సమ్మెకు సిద్ధం

నవ తెలంగాణ మెదక్ టౌన్

గ్రామపంచాయతీ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మెబాటకు సిద్ధమయ్యారని సీఐటీయూ జిల్లా కోశాధికారి కే నర్సమ్మ అన్నారు. శనివారం మెదక్ కేవల్ కిషన్ భవనంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని గతంలో పాదయాత్రలు నిర్వహించి అధికారులకు, శాఖామంత్రి దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటి వరకు పరిష్కరించకపోవడం అన్యాయమన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనం పెంచాలన్నారు. ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. మల్టీపర్పస్ పనిని రద్దు చేయాలన్నారు. రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు ఇతర సమస్యలు పరిష్కరించాలన్నారు. సమ్మె కోసం జిల్లాలో పది మండలాలు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, మల్లేష్, శ్రీనివాస్, నగేష్, జయమ్మ, యాదగిరి, భుదేమ్మ, సుమలత పాల్గొన్నారు.

సీఐటీయూతోనే మెరుగైన వేతన ఒప్పందం



నవతెలంగాణ-పటాన్‌చెరు

సిఐటియు ద్వారానే కార్మికులకు చట్టపరమైన సౌకర్యాలతో పాటు మెరుగైన వేతన ఒప్పందం జరుగుతున్నట్టు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పరిశ్రమ యూనియన్ అధ్యక్షులు కే.రాజయ్య అన్నారు. పార్లే ఆగ్రో పరిశ్రమలో వేతన ఒప్పందం అయిన సందర్భంగా పటాన్‌చెరు పట్టణంలోని శ్రామిక్ భవన్‌లో సీఐటీయూకు ఉద్యమ నిధిని యూనియన్ అధ్యక్షులు కే.రాజయ్యకు శనివారం యూనియన్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ.. కార్మికులకు సీఐటీయు ద్వారానే న్యాయం జరుగుతుందన్నారు. కార్మికుల పక్షాన నిలబడే ఏకైక కార్మిక సంఘం సీఐటీయూనే అని.. మెరుగైన వేతన ఒప్పందాలు సిఐటియుకే సాధ్యమన్నారు. కార్మికులందరు సంఘటితంగా ఉంటేనే విజయాలు సాధ్యమన్నారు, ఉద్యమ నిధిని అందజేసినందుకు ఈ సందర్భంగా కార్మికులకు కతజ్ఞతలు తెలిపారు. జనరల్ సెక్రెటరీ సంతోష్ గౌడ్, రాజశేఖర్, జంగయ్య, సుధాకర్, కిరణ్, నాగరాజు పాల్గొన్నారు.

సమాజంలో యువతపాత్ర కీలకం

- సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

నవతెలంగాణ - మెదక్



సమాజంలో యువత పాత్ర కీలకమని జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని పేర్కొన్నారు. శనివారం మెదక్ పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కాలేజ్‌లో విద్యార్థులకు పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో షీటీమ్, యాంటీ ఉమెన్ ట్రాఫిక్ యూనిట్ సంబంధించిన అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజ శ్రేయస్సులో విద్యార్థి దశ ముఖ్యమైందని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాల్య వివాహాలు అనర్థాలకు దారితీస్తాయని తెలిపారు. మూఢనమ్మకాలు, రోడ్డు భద్రతా నిబంధనలు, ప్రేమ వివాహాలు వాటి అనర్థాలు, పోలీస్ చట్టాల గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు చదువుకునే వయసులో ప్రేమ పట్ల ఆకర్షితులై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఉన్నత చదువులు చదివి తమ కన్నవారి కలలు నెరవేర్చాలని తెలిపారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా అపరిచిత వ్యక్తులు కాల్ చేసి లాటరీలు వచ్చిందని, లోన్లు ఇస్తామని, తక్కువ ధరకే ఆన్లైన్లో వస్తువులు వస్తాయని పలు రకాలుగా మోసాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. అపరిచిత వ్యక్తుల నుండి కాల్స్ వచ్చినప్పుడు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. అపరిచిత వ్యక్తుల పట్ల అనుమానం ఉంటే వెంటనే 100కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు బానిసలు కారాదన్నారు. మత్తు పదార్థాల సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వరలక్ష్మి, అధ్యాపకులు చంద్రలేఖ, కళా, మహేష్, దయాకర్, ఎస్ఐ మల్లయ్య, హెడ్ కానిస్టేబుల్ సురేందర్, కళా బృందం సభ్యులు, షీ టీం బృందం తదితరులు పాల్గొన్నారు.

ఆక్స్ఫర్డ్ పాఠశాలపై పోలీసు కేసు

- బుక్స్, యూనిఫామ్ పేరుతో వ్యాపారం చేస్తున్న ఆక్స్ఫర్డ్ స్కూల్
- స్కూల్ బుక్స్, యూనిఫామ్ అమ్ముతున్న గదిని సీజ్ చేసిన మండల విద్యాధికారి

నవతెలంగాణ జోగిపేట



అందోల్ ఎంఈఓ కృష్ణ విధులకు ఆటంకం కలిగించినందుకు ఆక్స్ఫర్డ్ పాఠశాల కరెస్పాండెంట్ వేణుపై ఎస్సై సామ్యనాయక్ తెలిపారు. తన విధులకు ఆటంకం కలిగించారని పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారని తెలిపారు. అంతకుముందు జోగిపేట్ ఆక్స్ఫర్డ్ స్కూల్ అధిక ఫీజులు తగ్గించాలని ఎస్.ఎఫ్.ఐ. ఆధ్వర్యంలో స్కూల్ ముందు ధర్నా శనివారం మూడు గంటల పాటు చేశారు. ధర్నా చేసిన తర్వాత లిమండల విద్యాధికారి కృష్ణ ఫోన్ చేసి విషయం చెప్పడంతో బుక్ స్టేషనరీని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్.ఎఫ్.ఐ. జిల్లా అధ్యక్షుడు ఎర్రోళ్ల మహేష్ మాట్లాడుతూ జోగిపేటలో ఆక్స్ఫర్డ్ స్కూల్ యాజమాన్యం జీవో ప్రకారం ఫీజులు తీసుకోకుండా ఇష్టానుసారంగా దండుకుంటోందన్నారు. మండల విద్యాశాఖ అధికారిని పిలిపించి స్కూల్లో బుక్ స్టేషనరీని సీజ్ చేయాలని కోరడంతో సీజ్ చేశారని తెలిపారు. బుక్ స్టాల్‌ను సీజ్ చేస్తున్న మండల విద్యాధికారిపై పాఠశాల కరెస్పాండెంట్ దురుసుగా మాట్లాడుతూ నువ్వు సీజ్ చేసినా తాళం పగలగొడతా అని, నీ అంత చూస్తా అంటూ మండలా విద్యాధికారిని బెదిరించారని ఆరోపించారు. పాఠశాల యజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు. పేరెంట్స్ కమిటీ ఆమోదం పొందిన తరువాతనే ఆక్స్ఫర్డ్ పాఠశాల యాజమాన్యం 10 శాతం ఫీజులు పెంచుకోవాలన్నారు. జోగిపేటలో అక్రమంగా ఫీజులు దండుకుంటున్న పాఠశాలపై మండల అధికారులు పర్యవేక్షణ చేసి తల్లిదండ్రులతో మాట్లాడి సమాచారం తీసుకొని అడ్డగోలుగా వసూలు చేస్తున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలన్నారు. స్కూల్‌ను సీజ్ చేసే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు వంశీ, ఎస్ఎఫ్ఐ మండల నాయకులు మైపాల్, రేణుకుమార్ సతీష్, కె మైపాల్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు టీచర్లనుంచి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-సంగారెడ్డి

నారాయణఖేడ్‌లోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో గణితం, ఫిజికల్ సైన్స్ సబ్జెక్టులకు, పుల్కల్ మండలంలోని బొమ్మారెడ్డిగూడెం బాలుర ఆశ్రమ పాఠశాలలో ఫిజికల్ సైన్స్ సబ్జెక్టు బోధించుటకు కాంట్రాక్టు పద్ధతిలో సెకండరీ గ్రేడ్ టీచర్స్‌గా పని చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ కోరారు. ఇంటర్‌తో పాటు డిఎడ్, టెట్ పేపర్-1 ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులన్నారు. విద్యార్హ తలతో పాటు స్థానిక ఎస్టి అభ్యర్థులకు, ఎక్స్పీరియన్స్ సర్టిఫికెట్ కలిగిన స్థానికులకు మొదట ప్రాధాన్యత ఇస్తారన్నారు. వచ్చేనెల 1న సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు.

26న కలెక్టరేట్ ముట్టడి

నవ తెలంగాణ - సిద్దిపేట

ఈ నెల 26న జరిగే కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ విద్యార్థులను కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా 26న కలెక్టరేట్ ముట్టడికి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపునివ్వడం జరిగిందని, కలెక్టరేట్ ముట్టడికి విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలన్నారు. విద్యార్థులకు రెండు జతలు దుస్తులు ఇవ్వాలన్నారు. అన్ని తరగతుల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వాలన్నారు.

ఇండ్ల స్థలాల సాధన కోసం పోరాటం

నవతెలంగాణ-సంగారెడ్డి



ఇండ్ల స్థలాల సాధన కోసం నేడు జరిగే సంగారెడ్డి పట్టణంలో భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని, అర్హులైన పేదలందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో శనివారం సుందరయ్య భవన్లో కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఎం సంగారెడ్డి ఏరియా కార్యదర్శి యాదగిరి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలు గడిచినా పేదలకు ఇండ్ల స్థలాలు, ఇండ్లను నిర్మించి ఇవ్వడంలో విఫలమయ్యాయని విమర్శించారు. 2022 నాటికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా నిరుపేదలందరికీ ఇండ్లు ఇస్తామని చెప్పిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఏ ఒక్కరికి సంగారెడ్డి పట్టణంలో ఇవ్వలేదని విమర్శించారు. పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లాలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పేదలకు ఇవ్వడంలో వైఫల్యం చెందారని దుయ్యబట్టారు. పేదల ఇంటి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.పది లక్షలు రాష్ట్ర ప్రభుత్వం రూ.ఐదు లక్షలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. గృహలక్ష్మి పథకం కింద రూ.పది లక్షలు ఇవ్వాలన్నారు. ఇండ్లు, ఇండ్ల స్థలాల కోసం జూలై మూడో తేదీన జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. 58 జీవో ప్రకారం పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు మనీ, విజయ, రాణి, సుజాత, మరియమ్మ రాజా, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట నీటిగుంత

నవతెలంగాణ-తొగుట



మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి రోడ్డు దాటేందుకు ఒకే కల్వర్టు ఉంది. నీరు అందులో నుంచి పోయేందుకు అవకాశం లేక పోవడంతో రోడ్డుపై ప్రవహిస్తోంది. డివైడర్ ఉండడం.. రోడ్డు ఒక పక్క పూర్తిగా నీటితో నిండిపోయింది. మార్కెట్‌లో ధాన్యం తూర్పాల పట్టడంతో తాలు, పొల్లు, చెత్త రోడ్డుపై పేరుకుపోయింది. తహసీల్దార్ కార్యాలయంలోనికి పోయే గేటు వద్దనే వర్షపు నీరు నిల్వడంతో కార్యాలయానికి వచ్చిపోయే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయం పక్క నుంచి మురుగు వెళ్లేందుకు నిర్మాణం చేసినా అది పూర్తిగా మట్టితో పూడుకుపోయింది. దీంతో నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గుండెపోటుతో పీఏసీఎస్ డైరెక్టర్ మృతి



నవతెలంగాణ-వట్‌పల్లి

రెండ్రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురైన ఖాదీరాబాద్ పీఏసీఎస్ డైరెక్టర్ సంగారెడ్డి గుండెపోటుతో శనివారం మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. 2020 ఫిబ్రవరి నెలలో ఖాదీరాబాద్ వ్యవసాయ పరపతి సహకార సంఘానికి జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున గొర్రెకల్ డైరెక్టర్‌గా సంగారెడ్డి గెలుపొందాడు. కాగా ఆయన రెండ్రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురికాగా.. హైదరాబాద్‌లోని లింగంపల్లి సిటిజన్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతుండగా.. శనివారం గుండెపోటుకు గురై మృతి చెందాడు. శనివారం మృతదేహాన్ని స్వగ్రామమైన గొర్రెకల్ తరలించి.. అంత్యక్రియలు పూర్తి చేశారు. అంత్యక్రియల్లో పీఏసీఎస్ చైర్మెన్ వినోద్ కుమార్ గౌడ్, వైస్ చైర్మెన్ రేగోడు మండల మాజీ ఎంపీపీ పత్రి విఠల్, పీఏసీఎస్ డైరెక్టర్లు, గొర్రెకల్ సర్పంచ్ నవనిత సుభాష్ గౌడ్, వైస్ ఎంపీపీ నాగరాణి బసవరాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ.. ప్రాణాలకు రక్షణ



నవతెలంగాణ-జహీరాబాద్

రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు హెల్మెట్లు ధరించిన వ్యక్తులు ఎంతోమంది ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డారని డీఎస్పీ రఘు అన్నారు. జహీరాబాద్ పట్టణం లోని ఆర్టీసీ బస్టాండ్ ముందు ఓ ప్రైవేటు వైద్యశాల ఆధ్వర్యం లో శనివారం హెల్మెట్ల పంపిణీ, ద్విచక్ర వాహనాల ర్యాలీని ప్రారంభించి.. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడారు. దాతలు హెల్మెట్లు పంపిణీ చేసేందుకు ముందుకు రావడం ఎంతో హర్షించదగ్గ విషయమన్నారు. ప్రజలకు హెల్మెట్ ప్రావీణ్యత తెలియ చేయాలన్న లక్ష్యంతోనే ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేసి ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ సిఐ తోట భూపతి, ఎస్సై శ్రీకాంత్, కాశీనాథ్, హోప్ ప్రైవేటు వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గ్యాదరి బాలమల్లు పరామర్శించిన ప్రముఖులు

నవతెలంగాణ-సంగారెడ్డి

సీఎం కేసీఆర్‌కు అత్యంత సన్నితుడు అయిన గ్యాదరి బాలమల్లు తల్లి ఇటీవలే మృతి చెందింది. కాగా బాలమల్లును సిద్దిపేటలోని తన నివా సంలో ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ వైస్ చైర్మెన్ పట్నం మాణిక్యం, ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు, బీఆర్ఎస్ నాయకులు వెంకటేశం శనివారం పరామర్శించారు.

బి.సి రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల ఏర్పాటు పట్ల సీఎంకు ధన్యవాదాలు



నవతెలంగాణ-సంగారెడ్డి

జిల్లా కేంద్రంలో బి.సి రెసిడె న్షియల్ డిగ్రీ కళాశాలను మంజూరు చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కి బి.సి సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు బీరయ్య యాదవ్ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఒకప్పుడు 200 రెసిడెన్సియల్ పాఠశాలల ఉండగా.. నేడు 1200లకు పెంచి.. బి.సి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల విద్యాభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నాడని కొనియాడారు.

'గౌడ ఆత్మీయ భవనం భూమిపూజ'ను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

హైదరాబాద్ గచ్చిబౌలిలోని కోకాపేటలో నేటి ఉదయం 11 గంటలకు నిర్వహించ తలపెట్టిన గౌడ ఆత్మీయ భవనం భూమిపూజా కార్యక్ర మాన్ని జయప్రదం చేయాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.రమేష్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్ర ఎక్సైజ్, క్రీడా, పర్యాటక, సాంస్కృతిక, పురా వస్తు, యువజన సర్వీసుల శాఖల మంత్రి డాక్టర్ వి. శ్రీనివాస్ గౌడ్ ప్రత్యేక కృషితో గీత వృత్తిదారుల సంక్షేమం, అభివృద్ధి కోసం నగరంలో ఆత్మ గౌరవ భవనం నిర్మాణానికీ అత్యంత విలువైన కోకాపేటలో 5 ఎకరాల భూమిని, భవన నిర్మాణానికి రూ.5 కోట్లను ప్రభుత్వం కేటాయించిందన్నారు. సంగారెడ్డి జిల్లాలోని గౌడ కులబాంధవులు, కల్లుగీత కార్మికులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

రేపు డయల్ యువర్ ఆర్.ఎం

నవతెలంగాణ-సంగారెడ్డి

రేపు(సోమవారం) డయల్ యువర్ ఆర్.యం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, మెదక్ రీజియన్, రీజినల్ మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం. 11:30 నుండి 12:30 వరకు ఈ కార్యక్రమం ఉంటుం దన్నారు. కావున సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాలోని ప్రయాణికులు వారి సూచనలు, సలహాలను 8500376267కు ఫోన్‌ద్వారా తెలియజేయాలన్నారు.

నేడే డయల్ యువర్ డిఎం

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ ఆర్టిసి డిపోలో నేడు(ఆదివారం) సుమారు 11:30 గంటల నుండి 12:30 గంటల వరకు 'డయల్ యువర్ డిఎం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్ గోపికృష్ణ తెలిపారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని ప్రజలు, ప్రయాణీకులు, విద్యార్థులు వారి సమస్యలను తెలిసి డిపో అభివృద్ధి కోసం సూచనలు చేయాలని విజ్ఞప్తి చేశారు. 9154298656 ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేసి సూచనలు ఫిర్యాదులు చేయవచ్చన్నారు. ఈ సదావకాశాన్ని నియోజకవర్గంలోని ప్రజలందరూ వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



నవతెలంగాణ-ఝరాసంగం

విద్యాశాఖ ప్రవేశపెట్టిన మెనూ ప్రకారమే విద్యార్థులకు భోజనం అం దించాలని మండలవిద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రం లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాల యంలో శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వ హించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థికి విద్యా శాఖ సూచించిన మెనూ ప్రకారం రుచికరమైన ఆహారం అందించాలన్నారు. పాఠశాల లో పరిశుభ్రత పాటించాలన్నారు. ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు విద్యార్థుల ప్ర తిభను గుర్తించాలని, విద్యలో వెనుకబడిన వారికి ప్రత్యేక శ్రద్ధ వహించే విధం గా చర్యలు తీసుకోవాలన్నారు.ఆయన వెంట పాఠశాల స్పెషల్ ఆఫీసర్ నిర్మల ఉన్నారు.

గుర్తు తెలియని వాహనాలు ఢీకొని ఇద్దరు మృతి



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలోని జాతీయ రహదారి 65 బైపాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వాహనాలు ఢీకొని.. గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. జహీరాబాద్ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి అందాదా ఎనిమిది గంటల సమయంలో అల్గోల్ చౌరస్తా బస్తాపూర్ గ్రామ పరిధిలో గుర్తు తెలియని వాహనాలు ఢీకొట్టడంతో.. సుమారు 45, 40 ఏండ్లు ఉన్న ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. కాగా మృతదేహాలను జహీరాబాద్ కమ్యూనిటీ వైద్యశాలలోని మార్చురీలో భద్రపరిచినట్టు ఎస్సై తెలిపారు.

రేజింతల్ పాఠశాలలో 'నో బ్యాగ్ డే'



నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని రేజింతల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శనివారం 'నో బ్యాగ్ డే' కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం సఫియా సుల్తానా మాట్లాడుతూ.. విద్యార్థులు చురుగ్గా ఉండేందుకు ప్రతినెల నాలుగో శనివారం నిర్వహిస్తున్న 'నో బ్యాగ్ డే' కార్యక్రమం ఎంతో ఉపయోగప డుతుందన్నా రు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు, రంగోలి, డ్రామా స్టోరీ, టెల్లింగ్ నిర్వహించారు. పాఠశాలలో విద్యా బోధన తో పాటు అనేక ఆటాపాటల కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

గుడుంబా విక్రయిస్తే కఠిన చర్యలు



నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలో ఎవరైనా గుడుంబా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సిబ్బంది హెచ్చరించారు. త్వంలోనే ఎన్నికలు రానున్న నేపథ్యంలో రుక్మాపూర్ తాండాలో గతంలో పాత కేసులు ఉన్న 8 మందిని తహసీల్దార్ ఎదుట శనివారం నారాయణఖేడ్ కానిస్టేబుల్ రామకృష్ణ ముందస్తు బైండోవర్ చేశారు. ఇకనుంచి గుడుంబా విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు.


పొలం పనుల్లో అన్నదాతలు బిజీ

- చిరుజల్లులతో వెల్లివిరిసిన ఆనందం
- పొలం పనులు జరుగుతున్నప్పడే రైతుబంధు అందించాలి : కర్షకుల ఆవేదన



నవతెలంగాణ-ఝరాసంగం

గత 15 రోజుల నుండి విపరీతమైన ఎండలతో అల్లాడిన రైతులు వర్షాలు లేక తీవ్ర ఆందోళన చెందారు. నైరుతి రుతుపవనాలు రాక అన్నదాతల్లో పలు అనుమానాలు రేకెత్తుతున్న సమయంలో శుక్రవారం రాత్రి తొలకరి చినుకులు కురవడంతో రైతుల్లో ఆనందం నెలకొంది. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం నుంచే అన్న దాతలు పొలం పనులలో నిమగ్నమయ్యారు. విత్తనాలను విత్తేందుకు సాంప్రదాయ పద్ధతి ద్వారా ఎడ్ల సాయంతో అరకలతో కొంతమంది, ట్రాక్టర్ల సాయంతో మరికొంత మంది బిజీ అయ్యారు. ప్రభుత్వం అందించే రైతుబంధు పథకం కింద పెట్టుబడి సహాయాన్ని వెంటనే విడుదల చేయాలని ఆయా గ్రామాల రైతులు డిమాండ్ చేస్తున్నారు. పొలం పనులు కొనసాగు తున్నప్పుడే డబ్బులను విడుదల చేస్తే ఉపయోగకరంగా ఉంటుందని, ఆలస్యంగా విడుదల చేసినట్లయితే ప్రైవేట్ వ్యక్తుల వద్ద రుణాలు తీసుకోవాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు.



సంతోష్‌రెడ్డి దాతృత్వం

ప్రభుత్వ పాఠశాలకు వెళ్లడానికి రూ.70 వేల సొంత నిధులతో విద్యార్థులకు ఆటో సౌకర్యం



నవతెలంగాణ-గుమ్మడిదల

మండలంలోని కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని గిరిజన తాండా నుంచి నల్లవల్లి ప్రభుత్వ పాఠశాలకు వెళ్లేందుకు రవాణా సౌకర్యం లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులూ నిత్యం పాఠశాలకు నడుచుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి నెలకొన్నది. ఈ విషయాన్ని శనివారం తాండావాసులు బీఆర్ఎస్ యువనేత యావన్న గారి సంతోష్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో సంతోష్‌రెడ్డి వెంటనే స్పందించి రూ.70 వేల సొంత నిధులతో విద్యార్థులకు ఆటో సౌకర్యం కల్పించి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఆయనకు విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ సర్పంచ్ ఆంజనేయులు, తెలంగాణ ఉద్యమ నేత మల్లేష్ గౌడ్‌తో పాటు యువకులు, విద్యావంతులు, గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు కమ్మరి రాము, గోవర్ధన్ రెడ్డి, నాగిరెడ్డిగూడెం బీఆర్ఎస్ గ్రామాధ్యక్షులు కర్ణాకర్‌రెడ్డి, సూరారం మహేష్, మల్లారెడ్డి, కొలను వెంకట్రామ్ రెడ్డి, రవి, ప్రభాకర్, మల్లేష్, నారాయణ, నర్సింలు, ఆగం మల్లేష్, శివ, రాములు, రమేష్, బాలకృష్ణ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-సంగారెడ్డి

ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అసభ్య పదజాలంతో ముదిరాజ్‌లను దూశించాడని.. ఆయన తీరును నిరసిస్తూ సంగారెడ్డి జిల్లా ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు పులిమామిడి రాజన్న ఆధ్వర్యంలో ఐబీ నుంచి కొత్త బస్టాండ్ వరకు శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం కౌశిక్ రెడ్డి దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా పులిమామిడి రాజు మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి ఇటీవల ఓ అధికారిక కార్యక్రమంలో పాల్గొనగా.. అక్కడ ఒక మహిళా నిలదీయగా.. అక్కడే ఉన్న జిఎస్ఆర్ టివి కెమెరామెన్ బండి అజయ్ ముదిరాజ్ ఆ వీడియో తీశాడన్నారు. దీంతో వెంటనే ఆ వ్యక్తిని కిడ్నాప్ చేసి కౌశిక్‌రెడ్డి అనేక రకాలుగా చిత్రవద చేశాడన్నారు. అసభ్య పదజాలంతో దూషిస్తూ.. ముదిరాజ్ కులాన్ని అత్యంత హీనమైన భాషతో అవహేళన చేశాడన్నారు. ఈ విషయంపై వెంటనే పాడి కౌశిక్‌రెడ్డి ముదిరాజులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని యెడల తెలంగాణలో ఎక్కడా కూడా బయట తిరిగే పరిస్థితులు లేకుండా చేస్తామని హెచ్చరించారు. తెలంగాణలో దాదాపుగా 60 లక్షలు జనాభా ఉన్న ముదిరాజ్‌లను చిన్నచూపు చూడడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గుండు వెంకన్న, జిల్లా ఉపాధ్యక్షులు మల్లేష్ ముదిరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి నగేష్ ముదిరాజ్, సంగారెడ్డి నియోజకవర్గ ఇంచార్జి పిట్టల రమేష్, వివిధ మండలాల కన్వీనర్లు యాదగిరి, ప్రభాకర్, వివిధ గ్రామాల ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరగా చేపట్టాలి



నవతెలంగాణ-జోగిపేట

మండలంలో అభివృద్ధి పనులను త్వరగా చేపట్టాలని ఎంపీపీ జోగు బాలయ్య అన్నారు. శనివా రం కార్యాలయ సమావేశ మందిరంలో అందోల్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న పనులను వేగవంతం చేయాల న్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందడంలో అధికారులు పనిచేయాలన్నారు. పంచాయితీ రాజ్ ఏఈ మొగులయ్య మాట్లాడుతూ.. మండలంలో 135 సీసీ రోడ్లు మంజూరు కాగా 125 రోడ్ల నిర్మాణం పూర్తి చేయడం జరిగిందన్నారు. 40 కమ్యూనిటీ భవనాలు మంజూరైతే వాటిలో 9 నిర్మాణాలు మాత్రమే పూర్తికావడం జరిగిందన్నారు. డిప్యూటీ తహసీల్దారు మధుకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ధరణి విషయంలో మండల స్థాయిలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేవని జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో కొన్ని పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కొత్త పట్టా పాసు పుస్తకాలు పొందిన వారు రైతుబంధుకు ధరఖాస్తు చేసుకోవాలని ఏఓ విజయరత్న సూచించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలోని ఆయా శాఖల భవన సముదాయాలకు నీరు కొరత ఉండడంతో కొత్తగా బోరు మోటరును మంజూరు చేసి బోరు వేయడం జరిగిందన్నారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రెడ్డి, జెడ్పిటీసీ రమేశ్, ఎంపిడీఓ సత్యనారాయణ, ఎంపిటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నేటి బహిరంగ సభను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

అర్హులైన పేదలందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డి పట్టణంలో నేడు జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో శనివారం స్థానిక సుందరయ్య భవన్‌లో కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) సంగారెడ్డి ఏరియా కార్యదర్శి యాదగిరి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చి 9 ఏండ్లు గడుస్తున్నా.. పేదలకు ఇండ్ల స్థలాలను కేటాయించడంలో, ఇండ్లను కట్టించడంలో విఫలమయ్యాయని విమర్శించారు. 2022 నాటికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా నిరుపేద లందరికీ ఇండ్లు ఇస్తామని చెప్పిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ.. సంగారెడ్డి పట్టణంలో ఏ ఒక్కరికీ ఇండ్లు ఇవ్వలేదని విమర్శించారు. పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన ముఖ్యమంత్రి కేసీఆర్.. జిల్లాలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పేదలకు ఇవ్వడంలో విఫలం చెందారని దుయ్యబట్టారు. పేదల ఇంటి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం పది లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షలు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. గృహలక్ష్మి పథకం కింద పది లక్షల రూపాయలు ఇవ్వాలన్నారు. ఇండ్లు, ఇండ్ల స్థలాల సాధన కోసం జూలై మూడో తేదీన జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. 58 జీవో ప్రకారం పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని.. లేని యెడల పేదలు ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు మనీ, విజయ, రాణి, సుజాత, మరియమ్మ, రాజా, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు రూ.10,000 ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఐడిఏబొల్లారం

బీహర్ రాష్ట్రానికి చెందిన నందు పార్థు పటేల్ పొట్టకూటి కోసం వలస వచ్చి బొల్లారం మున్సిపల్ పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీలో నివసిస్తున్నాడు. అయితే కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న అతడు శుక్రవారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందాడు. వారిది నిరుపేద కుటుంబం కావడంతో విషయం తెల్సుకున్న బొల్లారం బీజేపీ పార్టీ అధ్యక్షుడు కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి.. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియల కోసం రూ.10000 ఆర్థిక సాయం చేశారు. కాగా కృష్ణారెడ్డికి మృతుని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



ఆలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం



నవతెలంగాణ-పటాన్‌చెరు

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గంలో కుల మతాలకు అతీతంగా అన్ని మతాల ప్రార్థన స్థలాలను అభివృద్ధి చేయడంతో పాటు పరమతసహనాన్ని పెంపొందించడంలో పటాన్‌చెరు నియోజకవర్గం ఆదర్శంగా నిలుపుతున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ పరిధిలోని మల్లికా ర్జుననగర్‌లో శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి దేవాలయం జీర్ణోద్ధారణ పనులకు శనివారం స్థానిక సర్పంచ్ సుధీర్ రెడ్డి, ఎంపీటీసీ రాజు, పార్టీ మండల అధ్యక్షుడు పాండులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు మధుసూదన్ రెడ్డికి ఘన స్వాగతం పలికా రు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నియోజక వర్గంలో ఇప్పటివరకు 170 కి పైగా దేవాలయాలను ఎమ్మెల్యే నిర్మించి దైవభక్తి ని చాటుకున్నారన్నారు. రుద్రారంలోని పురాతన దేవాలయాలతో పాటు నూతన దేవాలయాల నిర్మాణాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు నర్సింహా, నాయకులు శివయోగెందర్ గౌడ్, నాగరాజు, అరుణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీసీ దరఖాస్తుల పరిశీలనలో అధికారులు



నవతెలంగాణ-జిన్నారం

జిన్నారం మండలంలో బీసీ కులాలకు సంబంధించి ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన పథకం కింద దరఖాస్తు చేసిన దరఖాస్తుదారుల పరిశీలన పరిశీలనలో భాగంగా గ్రామాల్లో శనివారం జిన్నారం మండలం అధికార బృందాలు పరిశీలన కార్యక్రమాన్ని ముమ్మరం చేశారు. జిన్నారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎ.రాములు, జిన్నారం ఎంపీ ఓ సంతోష్ కుమార్, సూపరిడెంట్ రాములు మూడు బృందాలుగా విడిపోయి ఆయా గ్రామాల సెక్రటరీలతో కలిసి దరఖాస్తులను తనిఖీ చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంపీడీవో రాములు జిన్నారం మండలంలోని అండూర్, సోలక్పల్లి, నల్తూర్ గ్రామాల వారీగా పరిశీలన కార్యక్రమాన్ని చేపట్టారు. మండల పరిధిలోని ఇతర గ్రామాల్లో ఎంపీఓ సంతోష్ కుమార్, సూపరిడెంట్ రాములు దరఖాస్తులను గ్రామాల వారీగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాములు మాట్లాడుతూ.. మండలపరిధిలోని అన్ని గ్రామాల్లో 574 దరఖాస్తులు ఈ పథకం కింద నమోదు చేసుకున్నారన్నారు. వీటిలో సాంప్రదాయ వృత్తి విభాగాల కింద 487, సాంప్రదాయేతర వృత్తి విభాగాల కిందట 50 దరఖాస్తులు వచ్చాయన్నారు. దరఖాస్తుదారులందరూ క్షేత్ర స్థాయిలో పర్యట నకు వచ్చిన అధికారులకు అందుబాటులో ఉండి పూర్తిస్థాయి సమాచారాన్ని అందించాలన్నారు.

నిరంతరాయంగా అభివృద్ధి పనులు

- అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి
- రూ.40 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన



నవతెలంగాణ-అమీన్‌పూర్

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో నిరంతరాయంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి తెలిపారు. అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలోని 21వ వార్డు మంజీరా నగర్‌లో, 12వ వార్డు బాలాజీ నగర్ కాలనీలో రూ.40 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీరోడ్డు నిర్మాణ పనులకు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. మున్సిపల్ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోందన్నారు. ప్రతి కాలనీలో ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రజాప్రతినిధుల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నావ న్నారు. ఇటీవల పటాన్చెరు బహిరంగ సభలో మున్సిపల్ అభివృద్ధికి సీఎం కేసీఆర్ రూ.30 కోట్ల నిధులు కేటాయించారని, ఎమ్మెల్యే జీఎంఆర్ సూచనలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ నరసింహ గౌడ్, కౌన్సిలర్లు సభ్యులు సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సాదాసీదాగా న్యాల్కల్ సర్వసభ్య సమావేశం





నవతెలంగాణ-న్యాల్‌కల్

ఎంపీపీ అంజమ్మ అధ్యక్షతన మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. గ్రామాల్లో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉన్నదని పలువురు సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకవచ్చారు. స్తంభాలు ఏర్పాటు చేసి, సమస్యలను పరిష్కరించాలని అధికా రులకు విజ్ఞప్తి చేశారు. విద్యుత్ ఏఈ అర్జున్ మాట్లాడుతూ.. సమస్యలేకుండా చూస్తామన్నారు. ఎంఈఓ మారుతి రాథోడ్ మాట్లాడుతూ.. మండలంలో 67 ప్రభుత్వ పాఠశాల ఉన్నాయని.. 5845 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. 8 జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఇంగ్లీష్, తెలుగు మీడియం విద్యా బోధన కొనసాగుతు న్నదన్నారు. ఈ విద్యా సంవత్సరానికి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు దుస్తుల పంపిణీ జరిగిందన్నారు. గత సంవత్సరం పదో తరగతి పరీక్షలో రేజింతల్, చాల్కీ ప్రభుత్వ పాఠశాలల్లో 100శాతం ఉత్తీర్ణత సాధించరన్నారు. వచ్చే నెల నుంచి ప్రభుత్వ పాఠశాలలో రాగిజావ అందిస్తారన్నారు. మెటల్ కుంట సర్పంచ్ పీటర్ రాజు మాట్లాడుతూ.. సీనియర్ మేట్లను, ఫీల్డ్ అసిస్టెంట్లు నియమించాలని సభ దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ పాఠశాలకు ఎంపీపీ నిధులతో ఐమాక్స్ లైట్ మంజూరు అయినట్లు సర్పంచ్ తెలిపారు. దశాబ్ది ఉత్సవాలో సీఏలు పనిచేయడం లేదని మండల ఏపిఎం కుమార్ దృష్టికి తీసుకువచ్చారు. ఏఈ క్రిష్ణ మాట్లాడుతూ.. ఎస్ఆర్ఇజిఎస్ నిధుల కింద మంజూరైన రేజింతల్, హద్నూర్ నూతన పంచాయతీ భవనాల పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. కాగా ఈ సమావేశానికి ఆర్అండ్‌బి, పశు వైద్య, ఆర్టీసీ అధికారులు హాజరు కాలేదు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ గౌసొద్దిన్, ఇంచార్జ్ తహసిల్దార్ మునిరోద్దీన్, ఎంపీడీఓ వెంకట్ రెడ్డి, సర్పంచలు, ఎంపీటీసీలు విజయలక్ష్మి, చంద్రన్న పాటిల్, శ్రీనివాస్ రెడ్డి, పీటర్ రాజు, కుతుబుద్దీన్, జ్ఞానేశ్వర్ పాటిల్, మల్లిక, అర్డబ్ల్యూఎస్ డిఈ సాబేర్ హుస్సేన్, మారుతీ రాథోడ్, రంగారావు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-కంది

ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నల్లవల్లి రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కంది, కాసిపుర్ తదితర పాఠశాలను శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. విద్యాసంస్థలు ప్రారంభమై 12 రోజులు అవుతున్నా.. విద్యార్థులకు ఇంకా సరిపడా పుస్తకాలు, యూనిఫామ్ రాలేదన్నారు. సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలలో 639 మంది విద్యార్థులు ఉంటే పదిమంది టీచర్స్ మాత్రమే ఉన్నారన్నారు. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా కనీసం ఒక్కో సబ్జెక్టుకు ముగ్గురు టీచర్స్ ఉండాలని.. కానీ ఒకరు మాత్రమే ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నైట్ వాచ్‌మెన్ లేక స్కూల్స్‌కి రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. మన ఊరు-మన బడి కింద డైనింగ్ హాల్, ఆరు తరగతి గదులను నిర్మించాలన్నారు. తాగే నీరు లేక విద్యార్థులు ఇంటి నుంచి నీళ్ళు తెచ్చుకుంటున్నారని.. పాఠశాలలో వాటర్ ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు అందించాలన్నారు. లేని యెడల ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

భూత్కూర్ రోడ్డు బురదమయం



నవతెలంగాణ-వట్‌పల్లి

మండలంలోని భూత్కూర్ రోడ్డు వట్‌పల్లి స్టేజి నుంచి గ్రామంలోనికి సుమారు రెండు కిలోమీటర్ల పైన పూర్తిగా దెబ్బతిని వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ రోడ్డు 10 ఏండ్లుగా మరమ్మత్తులకు నోచుకోకపోవడంతో కంకర తేలి గుంతలమయంగా మారింది. దీంతో గుంతలను మట్టితో పూడ్చి తాత్కాలికంగా రాకపోకలకు ఉపశమనం కలిగించినా.. గత రెండ్రోజులుగా కురుస్తున్న వర్షానికి రోడ్డు మొత్తం బురద మయంగా మారి నడవలేని దుస్థితి ఏర్పడింది. రోడ్లపై ఉన్న గుంతల్లో సర్పంచ్ మట్టితో నింపి రాకపోకలను సులువు చేసినప్పటికీ.. చినుకులు పడిన కొద్దీ గుంతలలో నింపిన మట్టి బురదమయం కావడంతో కాలినడకన సైతం వెళ్లలేని దుస్థితి ఏర్పడుతున్నది. రాత్రి వేళలో అయితే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.

భూనిర్వాసితులతో గ్రామసభ



నవతెలంగాణ-నిజాంపేట : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో శనివారం కాళేశ్వరం కాల్వ భూనిర్వాసితులు భూములు కోల్పోతున్న 64 మంది రైతులతో మండల తహసిల్దార్ ప్రభాకర్ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామసభకు మెదక్ ఆర్డీఓ సత్యనారాయణ హాజరైనారు. ఈ సందర్భంగా మండల తహసీల్దార్ ప్రభాకర్ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ 13 మల్లన్న సాగర్ కాలువ ద్వారా డిస్ట్రిబ్యూషన్ కెనాల్ కాల్వ నిర్మాణం కొరకు భూములు ఇవ్వాలని కోరగా, రైతులు తమ భూముల్లో నుంచి కాల్వ పనులు జరగనివ్వమన్నారు. కాళేశ్వరం కాలువ పనులకు రైతులు భూములు ఇవ్వమని ఖరాకండిగా అధికారులకు తెలిపారు. ఈ కాల్వ పనులు చేపడితే ప్రాణాలైనా అర్పిస్తాం కానీ ఈ కాల్వపనులు జరగనివ్వమని అధికారులకు హెచ్చరించారు. రైతులు ఇచ్చిన నివేదికను పై అధికారులకు పంపిస్తామని తహసిల్దార్ ప్రభాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అనూష, అర్ ఐ గంగాధర్ గౌడ్,కార్యదర్శి నరసింహులు,రైతులు పంజా శ్రీనివాస్,గంగరాజు గౌడ్, ఏక్బాల్, రాములు, జగన్, ఏసు రాములు, కొమురయ్య, ఎల్లం,బాల్య, గెరిగంటి బాబు, తదితరులు పాల్గొన్నారు



బ్లాక్ బెల్ట్ సాధించిన నవభారతి విద్యార్థులు



మార్షల్ ఆర్ట్స్‌తో విద్యార్థుల్లో మనోధైర్యం

నవతెలంగాణ-చిలిపిచేడ్

మార్షల్ ఆర్ట్స్‌తో విద్యార్థుల్లో మనోధైర్యం పెంపొందుతుందని, పోటీల్లో సాధించే సర్టిఫికేట్‌లతో స్పోర్ట్స్ కోటలో ఉన్నత చదువులు చదివేందుకు, ప్రభుత్వ ఉద్యోగాలు సాదించేందుకు అవకాశం ఉంటుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీకాంత్ గౌడ్, గ్రాండ్ మాస్టర్ పోచయ్య అన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓ పంక్షన్ హాల్లో వారియర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమి-ఇండియా, ఇంటర్నేషనల్ షావోలిన్ కుంగ్- ఫూ ఆధ్వర్యంలో స్టేట్ లెవెల్ బ్లాక్బెల్ట్ అవార్డ్ సెర్మని- 2023 కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నవభారతి పాఠశాల విద్యార్థులు వివేక్ వర్ధమాన్ గౌడ్, భవజ్ఞ, ప్రణవ్ తేజా గౌడ్ లు బ్లాక్ బెల్టులు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠశాలలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేష్, నిరంజన్, సంరీన్, గంగ వేణి, దేవి, శిరీష రోజా భవాని, మౌనిక, షరీఫా తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైల్‌ను తనిఖీ చేసిన జూనియర్ సివిల్ జడ్జి



నవ తెలంగాణ-మెదక్ టౌన్

తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవ సంస్థ అదేశాల మేరకు చైర్పర్సన్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీ శారద సూచనల మేరకు జూనియర్ సివిల్ జడ్జి రీటా లాల్ చంద్ మెదక్ సబ్ జైలును తనిఖీ చేశారు. జైలులో ఉన్న ఖైదిల ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. వంటశాల తనిఖీ చేసి ఆహారం గురించి జైలు పర్యవేక్షణ అధికారితో చర్చించారు. న్యాయ విజ్ఞాన సదస్సులో ముద్దాయిలకు వివిధ అంశాలపైన అనగా లీగల్ ఏడ్ అపాయింట్మెంట్, జైల్ అదాలత్, ప్రీ భార్గెనింగ్ చట్టాలపైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో దుర్గా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులు 30వ తేదీలోగా ఈకేవైసీ చేసుకోవాలి



నవ తెలంగాణ-టేక్మాల్

కొత్తగా పట్టాదార్ పాస్ బుక్‌లు వచ్చిన రైతులు తప్పనిసరిగా ఈ కేవైసీ చేసుకోవాలని శంకరంపేట ఏడిఏ రాంప్రసాద్ అన్నారు. శనివారం బోడ్మట్ పల్లి గ్రామంలో మండల వ్యవసాయ అధికారి రాంప్రసాద్ రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులు ఈ కేవైసీ నమోదు చేసుకోవాలని ప్రభుత్వం నుంచి వచ్చే రైతు బంధు, పీఎం కిసాన్ నిధులు జమ కావాలంటే తప్పనిసరిగా ఈకేవైసీ నమోదు చేసుకోవాలన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు ఈకేవైసీ చేసుకోని రైతులకు డబ్బులు జమ కావని సూచించారు. ఈ నెల 30వ తేదీ లోపు ప్రతి రైతు ఈకేవైసీ నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు ఎంఈవో లక్ష్మీ పాల్గొన్నారు

వీఓఏలకు శిక్షణ



నవతెలంగాణ-నిజాంపేట

మండల మహిళా కార్యాలయంలో వీఓఎలకు సెర్ప్, ఎన్ఆర్ ఏల్ఎం అప్లికేషన్‌లు, కార్యక్రమాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సభ్యురాలి కుటుంబ జీవనోపాధి ప్రణాళిక, సంఘం సూక్ష్మ రుణ ప్రణాళిక, కొత్త వ్యాపారాల గురించి వివరించారు. అలాగే సెర్ప్ ప్రొఫైల్ అప్, వివిధ రకాల ఆప్‌ల గురించి వివరించారు. నూతన మహిళా సంఘాల ఏర్పాటు వృద్ధ మహిళా సంఘాల ఏర్పాటు గురుంచి ప్రాజెక్టర్ ద్వారా అవగహన. కల్పించారు. ఈ కార్యక్రమం లో ఎపిఎం వెంకటస్వామి సిబిఓ ఆడిటర్ నాగరాజు సీసీ లు స్వరూప, లక్ష్మి కంప్యూటర్ ఆపరేటర్ కమ్ అకౌంటెంట్ స్వామి గ్రామ సంఘాల వీఓఎలు పాల్గొన్నారు.

మెడిసిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-వెల్దుర్తి

మెడిసిటీ మేడ్చల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మండల పరిధిలో హస్తాల్ పూర్ గ్రామంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని స్థానిక సర్పంచ్ మమతా పాండు రంగాచారి ప్రారంభించారు. మేడిసిటీ డాక్టర్లు పూజా రెడ్డి హరియా వైష్ణవి శ్రీరామ్ 150 మంది రోగులకు ఉచిత వైద్యాన్ని అందించారు. ఉచిత మందులను పంపిణీ చేశారు. ఆపరేషన్ అవసరమున్న వారిని మెడిసిటీ మేడ్చల్ ఆసుపత్రికి రిఫర్ చేశారన్నారు. హస్తాల్పూర్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించినందుకు వైద్య సిబ్బందిని స్థానిక సర్పంచి మమతా పాండురంగ చారి అభినందించారు. మెడిసిటి వైద్య సిబ్బందికి భోజన సౌకర్యం కల్పించామన్నారు

పొరపాటు వల్లనే వచ్చిన బీఆర్ఎస్ నాయకుల హాజరు

గ్రహించిన వెంటనే వెళ్ళిపోయారు : ఎంపీపీ సబిత



నవతెలంగాణ-నార్సింగి

జూన్ 22వ తేదిన జరిగిన సర్వసభ్య సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు పొరపాటు వల్లనే హాజరయ్యారని, పొరపాటును గమనించిన వెంటనే వారు వెళ్లిపోయారని ఎంపీపీ సబిత తెలిపారు.సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొనటం పట్ల కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా డీసీసీ నాయకుడు ఈరప్ప యాదగిరి యాదవ్ ఎంపీపీని వివరణ కోరగా శనివారం ఎంపిపి చిందం సబిత రవీందర్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరణ ఇచ్చారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఎంపిపి కార్యాలయంలోని సమావేశ మందిరంలో 22వ తేదిన అమర వీరులకు నివాళులు అర్పించారు. అనంతరం సర్వసభ్య సమావేశం జరిగింది. అయితే జరుగుతున్న సర్వసభ్య సమావేశాని అమరులకు నివాళి కార్యక్రమం అనుకుని కొందరు నాయకులు ఉండిపోయారని, అది గ్రహించిన ఎంపిపి ఆ నాయకులకు ఈ విషయం తెలియజేయగా, అక్కడి నుంచి తక్షణమే వెళ్ళి పోయారని ఎంపీపీ సబిత తెలిపారు. ఇది పొరపాటు వల్ల జరిగింది మాత్రమేనని, ఎలాంటి దురుద్దేశం, దురాలోచనతో జరిగింది కాదన్నారు.

విద్యార్థులకు ఉచిత బస్ పాస్ సౌకర్యం కల్పించిన జెడ్పీటీసీ



నవ తెలంగాణ సర్సాపూర్

మండల కేంద్రమైన శివంపేట ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా సహకారంతో ఉచిత బస్సు పాస్ సౌకర్యం కల్పించారు. ఈ బస్సు పాసులను శనివారం శివంపేట సర్పంచ్ పత్రాల శ్రీనివాస్ గౌడ్, ఉప సర్పంచ్ పద్మ వెంకటేష్‌లు విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, శివంపేట మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులు శివంపేట ప్రభుత్వ పాఠశాలకు చదువుకునేందుకు వస్తారని తెలిపారు. అటువంటి విద్యార్థులకు జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా సొంత డబ్బులతో విద్యార్థులకు సంవత్సరం వరకు ఉచితంగా బస్సు పాస్ సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. ఉచిత బస్ పాస్ సౌకర్యం కల్పించినందుకు విద్యార్థులు జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కొండల్, ఆర్టీసీ ఉద్యోగి యాదగిరి ,ఖదీర్ ,తదితరులు పాల్గొన్నారు.

శిథిలమైన తూముల మరమ్మతులు చేపడతాం

నీటిపారుదల శాఖ డిప్యూటీ ఈఈ రాజేందర్



నవతెలంగాణ-వెల్దుర్తి

వర్షాకాలం మొదలై 15 రోజులు గడుస్తున్నా చెరువుకుంటల తూముల వద్ద మరమ్మతులు చేపట్టడం లేదని సర్వసభ్య సమావేశంలో ఇరిగేషన్ అధికారులపై మండిపడడంతో అప్రమత్తమైన నీటిపారుదల శాఖ డిప్యూటీ ఈఈ రాజేందర్ ఏఈ కవితతో కలిసి శనివారం కుడి చెరువు దేవతల చెరువు తూములను పరిశీలించారు వెంటనే మరమ్మతులు ప్రారంభిస్తామన్నారు. దేవతల చెరువు తూము ఇరుకుగా ఉండటం వలన నీళ్లు ఎక్కువగా ఉండడంతో ప్రస్తుతం మరమ్మతులు చేపట్టిన ఇబ్బందికరమన్నారు. కుడి చెరువు తూము వద్ద వెంటనే మరమ్మతులు చేపట్టి ఆయకట్టుదారులకు న్యాయం చేస్తామన్నారు.

ఖాజీపేట గ్రామానికి రెండో విడత గొర్రెల పంపిణీ



నవతెలంగాణ-నర్సాపూర్

తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గొర్రెల పంపిణీ కార్యక్రమంలో భాగంగా నర్సాపూర్ మండల పరిధిలోని కాజీపేట గ్రామానికి 12 యూనిట్లు మంజూరు కాగా శనివారం గ్రామంలోని యాదవులకు సర్పంచ్ హేమలత మదన్మోహన్ ఆధ్వర్యంలో గొర్రెలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ సుమిత్, యాదవులు తదితరులు ఉన్నారు.

అందుబాటులో ఉండని సబ్ స్టేషన్ ఆపరేటర్లు

నవతెలంగాణ-కొల్చారం

అత్యవసర సమయంలో అందుబాటులో ఉండాల్సిన విద్యుత్ సబ్ స్టేషన్ ఆపరేటర్లు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మండల కేంద్రం కొల్చారం సబ్ స్టేషన్ విద్యుత్ ఆపరేటర్లు సమయానికి అందుబాటులో ఉండకుండా కార్యాలయానికి తాళం వేసి ఎక్కడకు వెళ్తున్నారో తెలియని పరిస్థితి. శనివారం అప్పాజీపల్లి గ్రామంలో విద్యుత్ వైర్ తెగి కింద పడిపోవడంతో గ్రామానికి చెందిన తిమ్మక్కపల్లి నర్సింలు ఈ విషయమై స్థానిక సబ్ స్టేషన్ కు వెళ్లగా కార్యాలయానికి తాళం వేసి ఉండడాన్ని చూసి వెనుతిరిగివెళ్లిపోయారు. చాలా సేపటి వరకు ఎవరు రాకపోవడంతో పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. ముందే వర్షాకాలం ఏ సమయంలో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. అప్రమత్తం ఉండాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విధుల పట్ల నిర్లక్ష్యంగా



వ్యవహరిస్తున్న ఆపరేటర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి





నవతెలంగాణ-మెదక్ రూరల్

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కళాబృందం సభ్యులు సూచించారు. జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని ఆదేశాల మేరకు మెదక్ పట్టణంలోని వెలుగు వెల్ఫేర్ రెసిడెన్షియల్ కాలేజ్‌లో విద్యార్థులకు పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో షి టీమ్, యాంటీ ఉమెన్ ట్రాఫిక్ యూనిట్ సంబంధించిన అధికారులతో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా మత్తు పదార్థాలు వినియోగించడం వల్ల జరిగే అనర్థాల గురించి, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, మూఢనమ్మకాలు, రోడ్డు భద్రతా నిబంధనలు, ప్రేమ వివాహాలు వాటి అనర్థాలు, పోలీస్ చట్టాల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా కళాబృందం వారు మాట్లాడుతూ.విద్యార్థులు చదువుకునే వయసులో ప్రేమ పట్ల ఆకర్షితులై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఉన్నత చదువులు చదివి తమ కన్న వారి కలలు నెరవేర్చాలన్నారు. గ్రామంలో ఎవరైనా అపరిచిత వ్యక్తుల పట్ల అనుమానం ఉన్నా వెంటనే పోలీసు డయల్ 100 కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు. అలాగే యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దన్నారు. ఈ కార్యక్రమంలో కళాబృందం సభ్యులు ప్రస్తుతం జరుగుతున్న పరిస్థితులపై పాటలు, మాటల రూపంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పి వరలక్ష్మి అధ్యాపకులు చంద్రలేఖ , కళా , మహేష్ దయాకర్ ఏ హెచ్ టి యు ఎస్సై మల్లయ్య , కళా బృందం సభ్యులు హెడ్ కానిస్టేబుల్ సురేందర్ ,కళా బృందం సభ్యులు,షీ టీం బృందం,విద్యార్థులు మొదలగు వారు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో తెలంగాణ అభివృద్ధి

నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి

నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్

దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి అన్నారు. శనివారం పెద్ద శంకరంపేటలోని రైతు వేదికలో అర్హులైన 46 మందికి కళ్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలో కులమతాలను పక్కనపెట్టి ఆడపిల్ల వివాహానికి ప్రభుత్వం కల్యాణ లక్ష్మి పథకం ద్వారా లక్ష 116 రూపాయలను అందిస్తుందన్నారు. గతంలో నారాయణఖేడ్ ప్రాంతంలో తాగునీటి సమస్య ఉండేదని. ప్రస్తుతం మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి తాగునీరు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ టిఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. విద్య వైద్యం వ్యవసాయం మహిళల ఆర్థిక అభివృద్ధి ఇలా అన్ని రంగాల్లో తెలంగాణ ప్రభుత్వం ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు. కాంగ్రెస్ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని వారి మాటలు ప్రజలు నమ్మవద్దన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి టిఆర్ఎస్ పార్టీ ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్ జెడ్పిటిసి విజయరామరాజు పేట సర్పంచ్ అలుగుల సత్యనారాయణ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు



మురళి పంతులు వైస్ ఎంపీపీ లక్ష్మీ రమేష్ తహసీల్దార్ చరణ్ ఎంపిటిసిలు వీణ సుభాష్ గౌడ్ స్వప్న రాజేశ్వర్ దత్తు సర్పంచుల ఫోరం అధ్యక్షులు కుంట్ల రాములు నాయకులు వేణుగోపాల్ గౌడ్ సురేష్ గౌడ్ పున్నయ్య శంకర్ గౌడ్ రవీందర్ మల్లేశం శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డిని బర్తరఫ్ చేయాలి

ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు మామిళ్ల ఆంజనేయులు

నవతెలంగాణ-మెదక్ టౌన్

ముదిరాజ్ జాతిని, యావత్తు బీసీ జాతిని అవమానించిన ఎమ్మెల్సీ పాడే కౌశిక్ రెడ్డిని బర్తరఫ్ చేయాలని ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు మామిళ్ల ఆంజనేయులు ముదిరాజ్, కౌన్సిలర్ రాజలింగం ముదిరాజ్‌లు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అత్యధిక శాతం ఉన్న ముదిరాజులపై అధికార పార్టీ అనే అహంకారంతో అవమానించిన ఎమ్మెల్సీ పాడే కౌశిక్ రెడ్డికి సరైన గుణపాఠం నేర్పుతామని హెచ్చరించారు. అధికార పార్టీలో ఉన్న ముదిరాజ్ నాయకులు నోరు మెదపకుంటే జాతి ద్రోహులుగా మిగిలిపోతారన్నారు.

నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్

ముదిరాజ్లను పరుష పదజాలంతో దూషించిన ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని శనివారం పెద్ద



శంకరంపేట ముదిరాజ్ సంఘం సభ్యులు పేట పోలీస్ స్టేషన్లో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం బాధ్యులు పున్నయ్య . బండల శ్రావణ్ సుధీర్ జోడు రవి శంకరయ్య రవీందర్ సర్వేష్ భాస్కర్ పాల్గొన్నారు.

నవతెలంగాణ -పాపన్నపేట

ముదిరాజులకు పాడి కౌశిక్ రెడ్డి క్షమాపణ చెప్పాలని పాపన్నపేట ముదిరాజ్ సంఘం అధ్యక్షులు కిష్టయ్య డిమాండ్



చేశారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ ముదిరాజ్ జాతికి క్షమాపణ చెప్పనట్లయితే కౌశిక్‌రెడ్డి ఇంటి ముందు ధర్నా చేస్తామన్నారు. తెలంగాణ ముదిరాజులు తెలంగాణలోని కౌశిక్‌రెడ్డిని తిరగనీయమన్నారు. మండల ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షులు సత్యనారాయణ, కార్యదర్శి కోరబోయిన నరసింహులు, నాయకులు బోయిని సాయిలు,నిరుడు సత్యం, దుర్గయ్య, చంద్రయ్య, రమణ,సర్పంచ్ లు ఆశయ్య, వెంకట్ రాములు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదకు ఆర్థిక సాయంతో చేయూత

నవతెలంగాణ-మెదక్ రూరల్

మెదక్ మండలం మగ్దంపూర్ గ్రామానికి చెందిన జక్కుల యాదమ్మ, యాదగిరి భార్యా భర్తలు ఇద్దరు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మృతుల కుటుంబ సభ్యులతో మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ ఫోన్‌లో మాట్లాడి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ మేరకు శనివారం మెదక్ మండల బీఆర్ఎస్ నాయకులు జయరాం రెడ్డి ద్వారా రూ.20 వేల ఆర్థిక సహాయం కుటుంబ సభ్యులకు అందజేశారు. రోడ్డు ప్రమాదంలో భార్య భర్తలు ఇద్దరు చనిపోవడం చాలా బాధాకరమన్నారు. మృతుల



కుటుంబానికి ఎల్లపుడు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ రజనీకాంత్, బీఆర్ఎస్ నాయకులు హనుమంత్ రెడ్డి, రాములు, మల్లేశం గిరిధర్ గౌడ్, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

బాధితుడిని పరామర్శించిన జెడ్పీటీసీ



నవ తెలంగాణ-నర్సాపూర్ : మండల కేంద్రమైన శివంపేట గ్రామానికి చెందిన మాల్యా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న శివంపేట జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా శనివారం బాధితుడిని పరామర్శించి. వైద్య ఖర్చులు నిమిత్తం రూ. 5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో శివంపేట సర్పంచ్ పత్రాలు శ్రీనివాస్ గౌడ్, పెద్ద గొట్టిముక్కుల ఉప సర్పంచ్ నవీన్, నాయకులు ఖదీర్, త్రినేష్ గౌడ్, బొడ్డు నరేష్ పాల్గొన్నారు.

రవీందర్ కుటుంబానికి అండగా ఉంటాం

ప్రాథమిక పాఠశాలలో పుస్తకాల పంపిణీ

ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి

నవతెలంగాణ-చిలిపిచేడ్

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉపాధ్యాయుడు రవీందర్ కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని, ఉపాధ్యాయుని కుటుంబం రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని ఎమ్మెల్సీ కూర రగోత్తం రెడ్డి అన్నారు. మండలంలోని రహీంగుడా తండాకు చెందిన గత నెల 12వ తేదీ నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి వద్ద బైకు డీసీఎం ఢీకొని ఉపాధ్యాయుడు నునావత్ రవీందర్, అమృత దంపతులు మృతి చెందడంతో శనివారం ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి రవీందర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి మాట్లాడుతూ.. రవీందర్ కుటుంబంలో అర్హత కలిగిన వారికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని, వారి పిల్లలు ప్రియాంక, ధనుష్ ఉన్నత విద్య అభ్యసించే వరకు పూర్తి బాధ్యత పిఆర్టియు సభ్యులు తీసుకుంటారని, ప్రభుత్వపరంగా వచ్చే బెనిఫిట్స్ త్వరగా వచ్చే విధంగా,





ఉద్యోగరీత్యా రావాల్సిన గ్రాడ్యుయేట్ అలవెన్స్ పెన్షన్ తప్పకుండా ఇప్పించే విధంగా చూస్తామన్నారు. అనంతరం రవీందర్, అమృత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం మండల కేంద్రం చిలిపిచెడ్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనుబాబు ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులకు నోట్ బుక్స్ పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షురాలు లక్ష్మీ దుర్గా రెడ్డి, మెదక్ జిల్లా పిఆర్టియు అధ్యక్షులు సబ్బని శ్రీనివాస్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సామ్యా నాయక్, గోపాల్ రెడ్డి, వీరేశం, కేజీబీవీ రాష్ట్ర అధ్యక్షురాలు సరూప రాణి, చిలిపిచెడ్ మండల అధ్యక్షులు రాఘవేందర్, శివంపేట మండల అధ్యక్షుడు అనిల్ రెడ్డి, తూప్రాన్ మండల అధ్యక్షుడు రమేష్, జిల్లా బాధ్యులు దన్ సింగ్, ఉపాధ్యాయులు రమేష్, భీమ్లా, రవీందర్ ,రాములు, శర్మ చందర్, మండలానికి చెందిన ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే గ్రామాల అభివృద్ధి

హుస్నాబాద్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి



నవతెలంగాణ-కోహెడ

రాష్ట్రంలో మారుమూల గ్రామాలను అభివృద్ధి చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని హుస్నాబాద్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. శనివారం పల్లె పల్లెకు ప్రవీణ్ అన్న గడప గడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని బత్తులవానిపల్లి, లక్ష్మీపూర్ గ్రామాలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మారుమూల గ్రామాలలోని ప్రజల సమస్యలు ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నపుడు బత్తులవానిపల్లెకు రోడ్డు, మంచి నీటి సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. . పేదవారికి సంక్షేమ ఫలాలు అందాలంటే కాంగ్రెస్ పార్టీనీ అధికారంలోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు కేడం లింగమూర్తి, జిల్లా ఉపాధ్యక్షులు బస్వరాజు శంకర్, పార్టీ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య, మాజీ సర్పంచ్ శెట్టి సుధాకర్, వరికోలు ఎంపీటీసీ జయరాజు, గ్రామ శాఖ అధ్యక్షులు లింగాల కుమార్, ఈర్ల రాజయ్య, ఎస్సీసెల్ అధ్యక్షులు చింతకింది శంకర్, కిసాన్ సెల్ అధ్యక్షులు భీంరెడ్డి తిరుపతిరెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దూలం శ్రీనివాస్‌గౌడ్, నాయకులు బందెల బాలకిషన్, వేల్పుల వెంకటస్వామి, సంగెం కిషన్, యాళ్ల శ్రీనివాస్‌రెడ్డి, వెన్న రాజు, శనిగరం తిరుపతి, తాటిపాముల ప్రవీణ్, పేరుక రామచంద్రం, సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మంద దయాకర్, సుదగోని మధు, యూత్ కాంగ్రెస్ జిల్లాప్రధాన కార్యదర్శి శివారెడ్డి, ఎన్ఎస్‌యూఐ నాయకులు సనత్‌రెడ్డి, మాడుగుల చింటు, రంజిత్, కార్తిక్, అంజి, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు బస్టాండ్ పనులు ప్రారంభం



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలోని బస్టాండు పనులు నిలిచిపోయిన సంగతి అందరికీ తెలిసిన విషయమే గత వారం రోజుల క్రితం నిజాంపేట బస్టాండు పనులకు బ్రేక్ అనే కథనానికి స్పందించిన నిజాంపేట గ్రామపంచాయతీ పాలకవర్గం ఎట్టకేలకు బస్టాండ్ పనులను శనివారం ప్రారంభించారు. బస్టాండ్ పనులను త్వర త్వరగా పూర్తిచేసి గ్రామ ప్రజలకు అంకితం చేసినట్లయితే గ్రామస్తులు ఎంతో సంతోషిస్తారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఏది ఏమైనాప్పటికీ బస్టాండ్ పనులు మొదలు కావడం చాలా సంతోషించదగ్గ విషయమని గ్రామస్తులు పాలకవర్గాన్ని ప్రశంసించారు.

జక్కపల్లి మోడల్ స్కూల్‌ను సందర్శించిన డీఈవో



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ మండల పరిధిలోని జక్కపల్లి గ్రామ సమీపంలోని మోడల్ స్కూల్ ను శనివారం డీఈఓ రాధా కిషన్, ఎంఈఓ బుచ్చా నాయక్‌తో కలిసి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా డిఈఓ రాధా కిషన్ మాట్లాడుతూ జక్కపల్లి మోడల్ స్కూల్‌లో నూతనంగా నిర్మించిన హాస్టల్‌ను ప్రారంభించి విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ప్రిన్సిపాల్ విజయలక్ష్మికి సూచించారు. అనంతరం అహ్మద్ నగర్ కేజీబీవీ కాలేజ్ హాస్టల్‌ను సందర్శించి పరిశీలించి ప్రిన్సిపాల్‌కు సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ భైరవరెడ్డి, తదితరులు ఉన్నారు.

జూనియర్ కళాశాలలో లీగల్ లిటరసి క్యాంప్



నవతెలంగాణ-మెదక్ టౌన్

జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్ పర్సన్ లక్ష్మీ శారద సూచనల మేరకు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కల్పన ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినులతో లీగల్ లిటరసీ క్యాంపును నిర్వహించారు. ఈ సదస్సులో బాల్య వివాహాలు, చైల్డ్ అబ్యూస్, చైల్డ్ యాక్ట్స్ అండ్ చైల్డ్ రైట్స్ గురించి, వివిధ చట్టాల పైన అవగాహన కల్పించారు. ఈ సదస్సులో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, కళాశాల లెక్చరర్స్, కళాశాల విద్యార్థినులు, పోలీస్ సిబ్బంది, కోర్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు బంధుకు దరఖాస్తు చేసుకోవాలి



నవతెలంగాణ-నిజాంపేట : కొత్తగా పాస్ పుస్తకాలు వచ్చిన రైతులు, ఆన్లైన్ ధరణిలో డిజిటల్ సంతకం అయిన వారు, ఒక్కసారి కూడా రైతుబంధుకి ధరఖాస్తు చేసుకోనివారు ప్రస్తుత వానకాలం రైతుబంధు పథకానికి అర్హులని మండల వ్యవసాయ అధికారి సతీష్ కుమార్ తెలిపారు. రైతులు ఏఈఓ వద్ద ధరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రైతుబంధు వచ్చి ఉన్న రైతులు మళ్ళీ ధరఖాస్తు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు.



తెలంగాణ జన సమితి పార్టీ సిద్దిపేట జిల్లా కన్వీనర్‌గా నీరుడి స్వామి



నవతెలంగాణ -గజ్వేల్

తెలంగాణ జన సమితి పార్టీ సిద్దిపేట జిల్లా కన్వీనర్‌గా నీరుడి స్వామిని నియమిస్తూ శనివారం ఆ పార్టీ అధ్యక్షులు కోదండరాం ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ జన సమితి పార్టీ జిల్లా కన్వీనర్‌గా నీరుడి స్వామికి హైదరాబాద్‌లో తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు ఆచార్య ప్రొఫెసర్ కోదండరాం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నీరుడి స్వామి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అప్పగించిన బాధ్యతను నిర్వహిస్తూ పార్టీని బలోపేతం చేస్తామన్నారు. తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరిరమేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ జన సమితి జిల్లా కోకన్వీనర్. అనిల్ రెడ్డి. ప్రవీణ్. కీసర స్వామి. పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో నో బ్యాగ్ డే



నవతెలంగాణ-గజ్వేల్

ప్రతిరోజు బ్యాగుల బరువుతో ఇబ్బంది పడుతున్న విద్యార్థులకు ప్రతి నాలుగవ శనివారం నో బ్యాక్ డే అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధునాల శ్రీనివాస్ తెలిపారు. శనివారం పాఠశాలలో విద్యార్థులు బ్యాగులు లేకుండా కనిపించారు. ప్రతిరోజు బ్యాగులతో వచ్చే విద్యార్థులు ప్రతినెలా నాలుగో శనివారం ఇలా రావడంతో విద్యార్థులు ఉత్సాహంతో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రేమలత వెంకటమ్మ బాలస్వామి పాల్గొన్నారు.

వైభోవపేతంగా చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవం



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని తోటపల్లి గ్రామంలో మంత్రి తన్నీరు హరీశ్ రావు స్వంత ఖర్చులతో నిర్మించిన ఆలయంలో చెన్నకేశవ స్వామి కల్లాణోత్సవాన్ని పురోహితులు నాదస్వర ధ్వనులు, ప్రత్యేక వేద మంత్రాలతో శనివారం వైభోవపేతంగా నిర్వహించారు. చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవానికి మంత్రి తన్నీరు హరీశ్ రావు తల్లి లక్ష్మిబాయ్ ముఖ్య అతిథులుగా హజరై వెండి కిరీటాన్ని సమర్పించారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ మండల చేరికల కమిటీ చైర్మన్ బోయినిపల్లి శ్రీనివాస్, గ్రామస్తులు హజరయ్యారు.

మంత్రి తల్లిదండ్రులకు జెడ్పీటీసీ ఆత్మీయ సన్మానం

తోటపల్లిలోని చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవానికి ముఖ్య అతిథులుగా హజరైన మంత్రి హరీశ్ రావు తల్లి లక్ష్మిబాయ్‌కి జెడ్పీటీసీ కనగండ్ల కవిత దంపతులు శాలువా కప్పి ఆత్మీయ సన్మానం చేశారు. ఎంపీటీసీ నల్లగొండ లక్ష్మి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత బస్సు పాసులు పంపిణీ చేసిన ఎంపీపీ



నవతెలంగాణ-మద్దూరు

దూల్మిట్ట మండలం లోని జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు, మద్దూరు ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి తన సొంత ఖర్చులతో ఉచితంగా బస్సు పాసులు పంపిణీ చేశారు, ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండల కేంద్రంలో ఉన్న పాఠశాలకు తోర్నాల, జాలపల్లి, లింగాపూర్, గ్రామాలలోని విద్యార్థులు చదువుకునేందుకు వచ్చేందుకు తన సొంత ఖర్చులతో ఉచితంగా బస్సు పాసులు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు, ఈ కార్యక్రమంలో సర్పంచ్ దుబ్బుడు దీపికా వేణుగోపాల్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి నాచగోని పద్మ వెంకట్ గౌడు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తదితరులు, పాల్గొన్నారు

తోర్నాలలో గౌడ సంఘం కమ్యూనిటీ హాల్ పనులు ప్రారంభం



నవతెలంగాణ-మద్దూరు

దూల్మిట్ట మండలం లోని తోర్నాల గ్రామంలో డిఎంఎఫ్టి నిధుల నుంచి గౌడ సంఘానికి రూ. 10 లక్షల నిధులు మంజూరు కావడంతో, సర్పంచ్ తాళ్లపల్లి రాజమ్మ శనివారం ముగ్గు పోసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గౌడ సంఘం కమ్యూనిటీ హాల్ నిధుల మంజూరుకు సహకరించిన మంత్రి హరీష్ రావు, జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ ఏ ఈ వినయ్ రెడ్డి, బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు గోనపల్లి మల్లేశం గౌడ, సంఘ పెద్దమనుషులు సభ్యులు తాళ్లపల్లి ఎల్లయ్య, తాళ్ల పెళ్లి సత్తయ్య వగలబోయిన కొమురెల్లి, తాళ్లపల్లి కిష్టయ్య , తాళ్లపల్లి నరసయ్య, తదితరులు పాల్గొన్నారు

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



నవతెలంగాణ-దుబ్బాక రూరల్

ఇటీవల దుబ్బాక మండలం గంభీర్‌పూర్ గ్రామానికి చెందిన మీరాపురం ఎల్లవ్వ (68) అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న టీపీసీసీ అధికార ప్రతినిధి, దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ నాయకురాలు కత్తి కార్తిక గౌడ్ ఆదేశాల మేరకు శనివారం వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జింక కనకయ్య (మాజీ ఎంపీటీసీ గంభీర్‌పూర్), దేవా గౌడ్, ఐరేని సాయితేజ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దేశానికి గొప్ప సంపద యువత

- దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు





నవతెలంగాణ-సిద్దిపేట

ప్రపంచంలో ఏ దేశానికి లేని సంపద భారతదేశానికి ఉందని, ఆ గొప్ప సంపద యువత అని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు అన్నారు. నెహ్రూ యువజన కేంద్రం ఆధ్వర్యంలో ఆజాద్‌కి అమృత్ కాల్ కార్యక్రమాన్ని శనివారం పట్టణంలోని విపంచిలో నిర్వహించారు. యువతకు, విద్యార్థులకు ఫోటోగ్రఫీ, రచన, కవిత్వం, చిత్రలేఖనం, సాంస్కృతిక కార్యక్రమాలపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో దేశ జనాభాలో మనం మొదటి స్థానంలో ఉన్నామని, మన దేశాన్ని అన్ని రంగాలలో మొదటి స్థానంలో ఉంచడానికి నరేంద్ర మోడీ గత తొమ్మిది సంవత్సరాలుగా కృషి చేస్తున్నారన్నారు. కరోనా లాంటి సమయంలో ప్రపంచానికి వ్యాక్సిన్‌ను అందించిన ఘనత మన దేశానికి దక్కిందన్నారు. ఆర్థిక వ్యవస్థలో ప్రస్తుతం మనం ఐదో స్థానంలో ఉన్నామని అన్నారు. ప్రస్తుతం 75 వసంతాల నుంచి వచ్చే 25 సంవత్సరాల లోపు మన దేశాన్ని మొదటి స్థానంలో నిలిపేందుకు మోడీ కృషి చేస్తున్నాంన్నారు. అందుకు యువత సహకరించాలన్నారు. ప్రభుత్వ బడుల్లో ప్రభుత్వ విద్య బలోపేతం అయినదని, విద్యతోపాటు క్రీడల పట్ల విద్యార్థులు ఆసక్తి చూపాలని, ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ పిల్లలను యూపీ మాదిరిగా ప్రభుత్వ బడులలోనే చదివించాలన్నారు. అంతకు ముందు ట్రైని కలెక్టర్ ఫయాజ్ అహ్మద్ మాట్లాడుతూ పంచప్రాన్ అంశాల పట్ల యువత తెలుసుకోవాలన్నారు. జిల్లా క్రీడా శాఖ అధికారి నాగేందర్ మాట్లాడుతూ యువత, విద్యార్థులు చదువుతోపాటు క్రీడల పైన ఆసక్తి చూపాలన్నారు. అనంతరం విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అంతకుముందు వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాళ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎన్ వై కే కోఆర్డినేటర్ రంజిత్ రెడ్డి, అధికారి కిరణ్, విభీషణ్ రెడ్డి, నర్సింలు, భాస్కర్ పాల్గొన్నారు.

వాణిజ్య శాస్త్ర విభాగంలో సర్టిఫికెట్ కోర్స్



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్: ఎంటర్ ప్రెన్యూర్ డెవలప్మెంట్ అంశంపై సర్టిఫికెట్ కోర్సు ఎతిమ్సుఇలాజ్ అనే సంస్థ ఆధ్వర్యంలో నవంబర్ నుంచి మే నెల వరకు ముగిసిందని పోగ్రాం డైరెక్టర్ నాగరాజు మున్నూరు అన్నారు. శనివారం సర్టిఫికేట్ కోర్స్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షులుగా కాలేజీ ప్రిన్సిపాల్ ఏ శ్రీనివాస్ రెడ్డి వ్యవహరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బాలుర హబ్‌లో వాణిజ్య విభాగ ఆధ్వర్యంలో 'ఎంటర్ ప్రెన్యూర్ డెవలప్మెంట్ అంశంపై సర్టిఫికెట్ కోర్సు ఎతిమ్సుఇలాజ్ అనే సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించామన్నారు. నవంబర్ నుంచి మే నెల వరకు ప్రోగ్రాం డైరెక్టర్ నాగరాజు మున్నూరు ఆధ్వర్యంలో నిర్వహించామన్నారు. ఎతిమ్సు ఇల్లాజ్ సెక్రెటరీ దేవి ప్రసాద్, బ్రాంచ్ మేనేజర్ సుహాస్ హాజరయ్యారు. కోర్సులో శిక్షణ పూర్తి చేసుకున్న దాదాపు 40 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ గణపతి రావు, లెఫ్టినెంట్ డాక్టర్ భవాని, వాణిజ్య విభాగం అధ్యాపకులు లక్ష్మీ నరసయ్య, మార్కండేయ, శ్రీధర్, బాలరాజు, పెద్దిరాజు, నవీన్, రామచంద్రం పాల్గొన్నారు.

చిన్నపాటి వర్షం
రోడ్డు పైనుంచి నీటి ప్రవాహం

- ఇబ్బంది పడుతున్న వాహనదారులు, ప్రజలు



నవతెలంగాణ-తొగుట

మండలంలో శుక్రవారం నుంచి వర్షాలు ప్రారంభమయ్యాయి. మండల వ్యాప్తంగా వర్షం బాగానే కురిసింది. శనివారం కురిసిన వర్షానికి రాంపూర్ గ్రామ సమీపంలో వర్షపునీరు రోడ్డు పైనుంచి ప్రవహిస్తోంది. మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మాణం తరువాత కట్ట మీది నుంచి ప్రాజెక్టు సీపీ వాటర్ కోసం పంట భూముల నుంచి వచ్చే నీటి కోసం కట్ట పక్క నుంచి కాల్వ నిర్మించారు. పోచమ్మ గుట్ట వద్ద నుంచి మొదలుకొని మల్లన్నసాగర్ ముంపు గ్రామం లక్ష్మాపూర్ వరకు ఈ నీరంతా రాంపూర్ గ్రామ సమీపంలో రోడ్డు నీరు వెళ్లేందుకు అవకాశం ఉంది. కట్ట పైనుంచి వచ్చిన, ఆయా ప్రదేశాల పంట భూముల నుంచి వచ్చిన నీరు రోడ్డు పైనుంచి ప్రవహిస్తోంది. ఒకే ప్రదేశం నుంచి వెళ్లేందుకు ప్రాజెక్టు అధికారులు కాల్వ ఏర్పాటు చేయడం ఆ ప్రాంతంలో రోడ్డుకు ఒకే పైపుతో నిర్మాణం చేసిన కల్వర్టు కావడంతో నీరు అందులో నుంచి వెళ్లక రోడ్డు పైనుంచి ప్రవహిస్తోంది. చిన్నపాటి వర్షానికే రోడ్డు పైనుంచి నీరు ప్రవహిస్తే భవిష్యత్‌లో భారీ వర్షాలు కురిస్తే రోడ్డు తెగిపోయే ప్రమాదం ఉందని ప్రయాణికులు వాపోతున్నారు. రాబోయే రోజుల్లో పెద్ద కల్వర్టు, చిన్న పాటి బ్రిడ్జి నిర్మాణం చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు అధికారులు, ఆర్ అండ్‌బీ అధికారులు తక్షణమే స్పందించి పెద్ద కల్వర్టు, చిన్న పాటి బ్రిడ్జి నిర్మాణం చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం కృషి



- బీఆర్‌ఎస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా నాయకులు విరాసత్‌అలీ

నవతెలంగాణ- గజ్వేల్

ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్నారని బీఆర్‌ఎస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా నాయకులు విరాసత్‌అలీ అన్నారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తొమ్మిది సంవత్సరాలుగా తెలంగాణ ప్రభుత్వం అన్ని సామాజిక వర్గాలకు, కార్మిక వర్గాలకు కావాల్సిన భవనాల నిర్మాణానికి కృషి చేస్తుందన్నారు. రైతు బీమా, రైతు బంధు, డబుల్ బెడ్ రూమ్, సొంత స్థలం ఉంటే రూ.మూడు లక్షలు అందిస్తామని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీష్ రావు ప్రత్యేక కృషితో గజ్వేల్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతుందని అన్నారు. సీఎం కేసీఆర్ ప్రాతినిధ్య వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలో పరిధిలోని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని చెప్పారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ అభివృద్ధికి పాలకవర్గం కృషి చేస్తుందన్నారు. వ్యవసాయ సీజన్ రావడంతో మార్కెట్ పాలకవర్గం రైతు సంఘంపై దృష్టి పెట్టిందన్నారు. మైనార్టీల కోసం గురుకులం ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్కే దక్కిందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా మైనార్టీలకు ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేయలేక పోయిందన్నారు. 2023 ఎన్నికల కూడా బీఆర్ ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు ఉమ్మడి మెదక్ జిల్లా గజ్వేల్ నియోజకవర్గం తెలంగాణ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ప్రతి సంక్షేమ పథకాన్ని మహిళల పేరిట ముఖ్యమంత్రి అమలు చేస్తున్నారని చెప్పారు. అన్ని వర్గాల సామాజిక భవనాలు గజ్వేల్‌లో నిర్మాణం చేపడుతున్నారన్నారు. కాంగ్రెస్ బిజెపి అభివృద్ధిని కోరుకోవడం లేదన్నారు. విద్యా వ్యవస్థపై కెసిఆర్ ప్రత్యేక దృష్టి పెట్టి మంచి ఫలితాలు వచ్చే విధంగా కృషి చేస్తున్నారన్నారు.

దండోరా మహాసభను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

దండోరా ఉద్యమంలో మాదిగ బిడ్డలు భాగస్వామ్యం కావాలని, జాతి భవిష్యత్ కోసం ప్రతి ఒక్క మాదిగ బిడ్డ దండోరా ఉద్యమం నా జన్మహక్కు అనే నినాదంతో ముందుకు రావాలని గజ్వేల్ మండల ఎంఈఎఫ్ అధ్యక్షులు సల్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక నాయకులతో ఆయన మాట్లాడుతూ ఈనెల 25న సిద్దిపేటలో ఉదయం 10:30 కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న శక్తి గార్డెన్‌లో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. అధికారంలోకి వస్తే ఎస్సి , వర్గీకరణ చేపడుతామని అటు కేంద్ర ప్రభుత్వం ఇటు రాష్ట్ర ప్రభుత్వం మాదిగలను మోసం చేశారన్నారు. భవిష్యత్ కార్యాచరణ కోసం సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యఅతిథిగా మందకృష్ణ మాదిగ విచేస్తున్నారని, జాతీయ, రాష్ట్ర, జిల్లా, డివిజన్, మండల, గ్రామస్థాయి దండోరా నాయకులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యం.ఈ.ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేబర్తి యాదగిరి, యం.ఈ.ఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉప్పరిపల్లి నాగభూషణం, ఉమ్మడి మెదక్ జిల్లా యం.ఈ.ఎఫ్ నాయకులు తప్పెట్ల రమేష్, గజ్వేల్ మండల యం.ఆర్.పి.యస్ నాయకులు ఎర్రోళ్ల గంగాధర్ పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం

- పాడి కౌశిక్ రెడ్డి బహిరంగంగా క్షమాపణ చెప్పాలి
- అసభ్యకర వాఖ్యలపై ముదిరాజ్ వర్గాల అగ్రహం

నవతెలంగాణ-మర్కుక్

ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డిని బర్తరఫ్ చేయాలని, బీఆర్‌ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు లింగ సత్యనారాయణ ముదిరాజ్ అన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా మర్కుక్ మండల కేంద్రంలో ముదిరాజ్ నాయకులతో కలిసి ఆయన ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డిని బర్తరఫ్ చేయాలని సిఎం చిత్రపటానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి కౌశిక్ రెడ్డి పిచ్చికుక్కలా ప్రభుత్వ అధికారులను తిట్టడం, ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. జర్నలిస్టును కులం పేరుతో దూషించిచటం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ నాయకులు కుంట సత్యం ముదిరాజ్, దండు శ్రీను ముదిరాజ్, లింగ భాస్కర్ ముదిరాజ్, వెంకటేష్ ముదిరాజ్ తదితరులున్నారు.

నవతెలంగాణ-మద్దూరు

ముదిరాజుల పట్ల ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మద్దూరు మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం మండల నాయకులు ఇట్టబోయిన కనక చంద్రం, ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు, ఈ కార్యక్రమానికి బీజెపి ఎంపీటీసీ కూరెళ్ళ రాజు గౌడ్, బిఎస్పి మండల అధ్యక్షుడు పాకాల ఇసాక్‌లు మద్దతు తెలిపారు, అనంతరం వారు మాట్లాడుతూ హుజురాబాద్ జి ఎస్ ఆర్ టీవీ కెమెరా మ్యాన్ అజయ్‌ని ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి కిడ్నాప్ చేసి, కొట్టడమే కాక ఆయనను కులం పేరుతో తిడుతూ ముదిరాజులను కించపరిచే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైనది కాదన్నారు, సీఎం కేసీఆర్ పాడి కౌశిక్ రెడ్డిని ఎమ్మెల్సీ పదవి నుంచి వెంటనే భర్త రఫ్ చేయాలని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో మండల నాయకులు బోయిన మనోహర్, మేప మద్దూరు మండల ప్రధాన కార్యదర్శి మహేందర్, గాగిల్లాపూర్ కుల సంఘం నాయకులు ఇట్టబోయిన బాలమల్లు, ఇట్టబోయిన కనకయ్య, చింతల కనకయ్య శ్రీరాముల వెంకటేష్, కుక్కల కనకయ్య, పైసా బాలకృష్ణ, బొల్లు చంద్రయ్య, చింతల శ్రీనివాస్, నారదాసు సాయిరాజ్, మద్దూరు సంఘం నాయకులు పోతుల వీరేశం, కుక్కల గోపాల్, గొట్టే శివ, బోయిని కృష్ణ, రేబర్తి కుల సంఘం నాయకులు చింతల యాదగిరి, గుల్ల రాజు, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు

నవతెలంగాణ-నంగునూరు

ముదిరాజ్ జర్నలిస్ట్ బండి అజయ్‌ను కులం పేరుతో దూషించిన వ్యాఖ్యలను ఖండిస్తూ శనివారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ముదిరాజ్ సంఘం నుంచి వ్యతిరేక నినాదాలు చేస్తూ ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను ఊరేగింపుగా తీసుకవచ్చి బాబు జగ్జీవన్ రామ్ చౌరస్తాలో దహనం చేసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్ కులాన్ని అవహేళన చేసి అజయ్‌పై దాడి చేసిన ఎమ్మెల్సీని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు సొప్పరి సాయిలు, గౌరబోయిన కనకయ్య, భీమరి కనకరాజు, గౌరబోయిన స్వామి, కొండిల్ల రాజు,సొప్పరి ప్రశాంత్ కుమార్, సొప్పరి శ్రీనివాస్, చింతల రాజు, చింతల నవీన్,నీల స్వామి,జంగిటి సత్తయ్య, గాడిచెర్ల సంతు, వస్తాదుల యాదయ్య,ముదిరాజ్ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బెజ్జంకి

యూట్యూబ్ చానల్‌లో పనిచేస్తున్న ముధిరాజ్ వర్గం యువకుడిపై తన అనుచరులతో దాడి చేయించి అసభ్యపదజాలంతో దూషించిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డిపై ముధిరాజ్ వర్గాల ప్రజలు అగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ మాజీ యువజన మండలాధ్యక్షుడు గూడెల్లి శ్రీకాంత్ అద్వర్యంలో ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి అసభ్యకర వాఖ్యలను ఖండిస్తూ అయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ముధిరాజ్ వర్గాలపై చేసిన అసభ్యకర వాఖ్యలకు ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి బేషరుతుగా క్షమాపణలు చెప్పాలని లేనిపక్షంలో రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెబుతామని గూడెల్లి శ్రీకాంత్ హెచ్చరించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ముక్కీస రత్నాకర్ రెడ్డి,నాయకులు బోనగిరి రాజేందర్, రొడ్డ మల్లేశం,మైల ప్రభాకర్,డీవీ రావు,గూడెల్లి ఐలయ్య,బోనాల ఐలయ్య,బండిపెల్లి రాజు,రంగోని







రాజు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ- గజ్వేల్

ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి రిపోర్టర్ అజయ్‌ను కిడ్నాప్ చేసి కొట్టి, కులంపేరుతో దూషించడం పట్ల ముదిరాజులు మండిపడ్డారు. శనివారం గజ్వేల్‌లో కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను ఊరేగించి ఇంద్ర పార్క్ చౌరస్తాలో దహనం చేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డిని పదవి నుంచి వెంటనె భర్తరఫ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. పోలీస్ స్టేషన్‌లో ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డిపై పిర్యాదు చేశారు. కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గుంటుకు శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి పిట్ల ఆంజనేయులు, కాళ్లసాయి,చిక్కుడు రాజు,చిక్కుడు ప్రసాద్, కేశమైన బాస్కర్,గిరిపల్లి బాల్ చంద్రం,అడప మురళి, దుద్దెడ గణేష్, కనకయ్య, లింగరాజ్ పేట యాదగిరి, మల్లేశం, నాగరాజు, బాలయ్య, శ్రీనివాస్ ,ముంప గ్రామాల ముదిరాజ్‌లు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

జీఎస్ఆర్ జర్నలిస్ట్ అజయ్ ముదిరాజ్‌ను కులం పేరుతో దూషించిన పాడి కౌశిక్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ముదిరాజ్ సంఘం సభ్యులు అన్నారు. సిద్దిపేట ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శనివారం పాడి కౌశిక్ రెడ్డిపై సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు భైరీ శంకర్ మాట్లాడుతూ నిజాలు మాట్లాడే జర్నలిస్టులపై బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో దాడులు పెరిగాయన్నారు. కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలను ముదిరాజ్ కుల సంఘంతో పాటు జర్నలిస్టులు కూడా ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. పాడి కౌశిక్ రెడ్డిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ- సిద్దిపేట రూరల్









ముదిరాజుల ఆత్మగౌరవం దెబ్బ తినే విధంగా మాట్లాడిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని రాఘవపూర్ గ్రామంలో ముదిరాజుల యువత ఆధ్వర్యంలో కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం జిల్లా నాయకులు పడిగే ప్రశాంత్ మాట్లాడుతూ ముదిరాజుల ఆత్మ గౌరవాలు దెబ్బతినే విధంగా మాట్లాడిన కౌశిక్ రెడ్డిని బీఆర్‌ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ముదిరాజులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని లేనియెడల భవిష్యత్తులో ముదిరాజులు బుద్ధి చెప్తారన్నారు . ఈ కార్యక్రమంలో పడిగే వెంకటేష్, సుధాకర్, దుర్గం ధినేష్, రాకేష్, గణేష్, బాలరాజు, పడిగే కనకరాజు, పాల్గొన్నారు

నవతెలంగాణ-వర్గల్

ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై వర్గల్ ఉప సర్పంచ్ రమేష్ ముదిరాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్గల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ. మధ్యలో వచ్చిన పదవిని చూసుకొని విర్రవీగితే తమ సత్తా చూపిస్తామని, రాజకీయ భవిష్యత్ లేకుండా చేస్తామని హెచ్చరించారు. కౌశిక్ రెడ్డిని తక్షణమే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. భేషరతుగా తమ కులానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. తాము రాజకీయంగా బలంగా లేనందుకే ఇలాంటి మాటలు పడాల్సి వస్తుందని, వచ్చే ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన తమకు రావాల్సిన సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

బాలసదనం విద్యార్థులకు లగేజ్ బ్యాగుల పంపిణీ



నవతెలంగాణ-సిద్దిపేట

తన కుమారుడు కొల్తురి గణేష్ గౌడ్ పుట్టినరోజు సందర్భంగా పట్టణంలోని బాలసదనం అనాథ పిల్లలు, విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేసినట్లు టీఆర్ఎస్ నాయకులు కొల్తురీ మల్లేశం తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ తన కుమారుడి పుట్టినరోజు సందర్భంగా పేదలకు బ్యాగులు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో రేణుక, బాలసదనం వార్డెన్ రమ , సిబ్బంది పాల్గొన్నారు.

మురికి కాల్వలను పరిశీలించిన కమిషనర్



నవతెలంగాణ-సిద్దిపేట

వర్షాకాలంలో మురికి కాల్వలు పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ సంపత్‌కుమార్ అన్నారు. శనివారం మురికి కాలువలను మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ పరిశీలించారు. 43, 28 వార్డులలో వర్షానికి వచ్చే నీరు వెళ్లెందుకు డ్రైన్స్ క్లియర్‌గా ఉన్నాయా లేవా అని పరిశీలించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ వనిత తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన శ్రీగిరిపల్లి పోచమ్మ(75) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందింది. శనివారం మర్కుక్ ఎంపీపీ తాండ పాండు గౌడ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు తదితరులున్నారు.

రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-కొండపాక

రైతుబంధు పథకం కింద కొత్త రైతులు పెట్టుబడి సహాయం కోసం దరఖాస్తులు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారిని ప్రియదర్శిని తెలిపారు. జూన్ 16 నాటికి రిజిస్ట్రేషన్ పూర్తయి పాస్ బుక్కులు పొందిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గతంలో రైతుబంధు సహాయం పొందని వారు సైతం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో గ్రామాల్లో ఏ ఈ ఓ లకు అందజేయాలన్నారు.

ఐవీఎఫ్ సేవా కార్యక్రమాలు



నవతెలంగాణ - సిద్దిపేట

ఎం.వెంకట లింగం శైలజ దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో స్థానిక బాలసదనం స్త్రీ శిశు సంక్షేమ హాస్టల్‌లో 25 మంది పిల్లలకు భోజనం అందించినట్లు ఐవీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు కాసనగొట్టు స్వప్న తెలిపారు. వైశ్య భవన్‌లోని గోశాలకు పశుగ్రాసం, కూరగాయలు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చింత అనిత, కూర నవీన, ఇల్లందుల స్వప్న, హాస్టల్ సూపరిండెంట్ రమా, వైశ్య భవన్ కోశాధికారి కూర శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం నియామకం

నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గాన్ని శనివారం ప్రభుత్వం ప్రకటించింది. మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా సుంకరి మల్లేశం, పుర్మ వెంకట్ రెడ్డిలకు రెండవసారి అవకాశం లభించింది. డైరెక్టర్ లుగా శనిగరం సత్యనారాయణ, బుట్టి ఆగమల్లు, జిల్లా రాజేశం, బాశెట్టి బుచ్చి రాములు, తాటికొండ సదానందం, మెరుగు కృష్ణ, బావండ్లపల్లి రాజు, వంగా రామరాజు, భీమరాజు, ఉమామహేశ్వర్, మహేందర్ రెడ్డిను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

సంబరాల పేరిట ప్రజాధనం దుర్వినియోగం



నవతెలంగాణ-నంగునూరు

తెలంగాణ అవతరణ దశాబ్ది సంబరాలంటూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి మండిపడ్డారు. శనివారం నంగునూరు మండలం ఖానాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు.పదేండ్ల సంబురాలని గొప్పలకు పోతున్న ప్రభుత్వం తొమ్మిది ఏండ్ల పాలన ప్రజలకు ఏమి చేశారని ఈ వేడుకలు చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. సాగు నీళ్ళే రాని కాళేశ్వరం ప్రాజెక్ట్ కు కమీషన్ల కోసమే కట్టించి ప్రజల కొంపలు, పంటలు ముంచుతున్నారని విమర్శించారు.రైతు బంధు అనే రాబంధు లాంటి పథకం తెచ్చి రైతులకు ఉచిత ఎరువులు, పంట నష్ట పరిహారం, పంటల భీమ పథకాన్ని ఎత్తేసీ లక్ష రూపాయల రుణమాఫీ ఊసే లేదన్నారు.ధరణితో భూప్రక్షాళన అంటూ చివరకు భూములనే అమ్ముతున్నాం దుకా ఈ సంబారాలంటూ ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబాన్ని కోట్లకు పడగలెత్తించి మిగులు నిధులు ఉన్న రాష్ట్రాన్ని ఐదులక్షల కోట్ల రూపాయల అప్పుల పాలు చేశారని ఆరోపించారు.లక్షల కొలువులని ఆశలు పెట్టి పేపర్ల లీకులతో యువతను నైరాష్యంలోకి నెట్టి వారి జీవితాలతో చెలగాటం ఆడుతున్నాడని విమర్శించారు.మిషన్ భగీరథ మిషన్ కాకతీయలతో తెలంగాణాకు జలకళ అంటూ గుక్కెడు నీళ్లకోసం ప్రజలు గోసలు పడుతున్నారని ఆరోపించారు.57 సంవత్సరాలు నిండిన ప్రతి వ్యక్తి ఆసరా పెన్షన్ పథకం అమలు చేయనందుకా..ఎందుకోసం ఈ సంబరాలంటూ ప్రశ్నించారు.సమావేశం అనంతరం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులుగా ఘనపురం రమేష్, ఉపాధ్యక్షులుగా పెరక నవీన్, ప్రధాన కార్యదర్శిగా మోతుకూరి ప్రవీణ్, ప్రచార కార్యదర్శిగా నంగునూరు నగేష్ లను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో రాంపూర్ ఎంపీటీసీ ఏనగందుల నితిన్ కుమార్, చెలికాని యాదగిరి, గొట్టం రంగారెడ్డి, అనరాజు నాగరాజు, ముస్త్యాల యాదగిరి, గాండ్ల రమేష్, రాగుల కనకయ్య, రాగుల కృష్ణ,దాసరి కిషన్, గోనేపల్లి శివప్రసాద్ గౌడ్,జి. కరుణాకర్, ఎం. నర్సింలు,ఆల్మోద్దీన్,శశి తదితరులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్‌లో ఉచిత మిషన్ శిక్షణ



ప్రజాత ఫౌండేషన్ వ్యవస్థాపకులు మామిడి మోహన్ రెడ్డి

నవతెలంగాణ-దౌల్తాబాద్

ఉచిత కుట్టు మిషన్ శిక్షణను మహిళలు పక్కగా నేర్చుకోవాలని ప్రజాహిత ఫౌండేషన్ వ్యవస్థాపకులు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మామిడి మోహన్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ప్రజాహిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మామిడి మోహన్ రెడ్డి మాట్లాడుతూ దౌల్తాబాద్ మండల కేంద్రంలో కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు.ఉచిత శిక్షణ మహిళలకు ఎంతో లాభదాయకమని, అందుకు ప్రతి ఒక్కరూ పక్కాగా కుట్టు మిషన్ శిక్షణ పొందాలని ప్రతి ఒక్క మహిళా ఏదో ఒక నైపుణ్యాన్ని కలిగి ఉండి స్వతహాగా ఎదగడం అనేది చాలా ముఖ్యమని అందుకు ప్రతి ఒక్క మహిళా కుట్టు మిషన్ శిక్షణను పూర్తి స్థాయిలో నేర్చుకొని స్వంతంగా ఉపాధి పొందుతూ కుటుంబంలో సమాజంలో మంచి వ్యాపారులుగా పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. మండలంలోని మహిళలు ప్రతి ఒక్కరూ కుట్టూ మిషన్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో దౌల్తాబాద్ సర్పంచ్ ముత్యం గారి యాదగిరి,ఎంపీటీసీ వనిత వేణు,గ్రామ టిఆర్ఎస్ అధ్యక్షులు నరసింహారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ నాగరాజు దౌల్తాబాద్ మండల్ యువజన నాయకులు నర్రా రాజేందర్,ఆంజనేయులు, ఆత్మ కమిటీ డైరెక్టర్ సుదర్శన్, వర్కింగ్ ప్రెసిడెంట్ చింటూ,రాయపోల్ జడ్పిటిసి లింగాయపల్లి యాదగిరి,మాజీ సర్పంచ్ శ్రీనివాస్, సోషల్ మీడియా పీటర్,మండల సీనియర్ నాయకులు రాజిరెడ్డి,గువ్వలేగి యువజన నాయకులు సందీప్, టిఆర్ఎస్వి అధ్యక్షులు ఆనంద్, ఆత్మ కమిటీ డైరెక్టర్ మురళి,ప్రజాహిత ఫౌండేషన్ సభ్యులు మోహన్, ప్రశాంత్,నవీన్,తుడుం ప్రసాద్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ దౌల్తాబాద్

మండలం సూరంపల్లి గ్రామంలో శనివారం దుబ్బాక నియోజకవర్గ శాసనసభ్యులు ధవనేని రఘునందన్ రావు ఆదేశాల మేరకు సూరంపల్లి గ్రామ ఉప సర్పంచ్ బొల్లం స్వామి కొద్దీ రోజుల క్రితం అప్పుల బాధతో మరణించిన బొల్లం లింగం గారి కుటుంబానికి తన స్వంతంగా 50 కిలోల సన్నబియ్యం అందజేశారు.గ్రామ ఉపసర్పంచ్ బొల్లం స్వామి మాట్లాడుతూ అప్పుల బాధలో ఉన్న బొల్లం లింగం కుటుంబానికి వారి కుమారుడికి పార్టీలకు అతీతంగా అందరూ తమవంతు సహాయం చేయగలరని తెల్పినరు.మరియు బొల్లం లింగం గారు మరణించినా రోజున 10 వ తరగతి మిత్రులు అందరూ కలిసి చేసిన సహాయాన్ని గుర్తు చేసినారు. ఇట్టి కార్యక్రమంలో గ్రామ బీజేపీబూత్ అధ్యక్షుడు కేంబసారి మల్లేష్,మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు చిందం నర్సింలు,కముటాం బాల్ నర్సు,మహేష్ ,నర్సింలు,ఇసాక్, బొల్లం రాజు,బొల్లం నర్సింలు,బీజేపీ నాయకులు మరియు పాల్గొన్నారు.

నాయి బ్రాహ్మణులకు కమ్యూనిటీ హాల్ ప్రొసీడింగ్ పత్రాలు



నవతెలంగాణ-నిజాంపేట

నిజాంపేట మండల కేంద్రంలో నాయిబ్రహ్మణ కులస్తులకు శనివారం జిల్లా పరిషత్ నిధులో భాగంగా మండల జెడ్పీటీసీ పంజా విజయ్ కుమార్ నాయిబ్రహ్మణ సంఘానికి రూ.5 లక్షల ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ నాయిబ్రహ్మణ కులస్తుల సంఘ భవనం బాగోలేనందున భవన నిర్మాణ పనులకు జెడ్పీటీసీ హామీ ఇవ్వడంతో జిల్లా పరిషత్ నిధుల్లో రూ. 5 లక్షలు మంజూరు కాగా ప్రొసింగ్ పత్రాలను అందజేశారు. త్వరితగతిన పనులను ప్రారంభించి త్వరలోనే మరో రూ. 5 లక్షలకు కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జాల పోచయ్య, జిపి స్వామి, సూరా రాములు, మోహన్ రెడ్డి, నాయిబ్రహ్మణ కులస్తులు బాలరాజు, యాదగిరి, సత్తయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో సీమంతం



నవతెలంగాణ-నార్సింగి

మండల పరిధిలోని జప్తి శివునూర్ గ్రామం కాశ్యాతండా అంగన్వాడీ మినీ సెంటర్‌లో అమీనాబీకు సర్పంచ్ దంపతులు షరీఫ్ షేక్ హసీనా బెగుంలు సీమంతం జరిపించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దంపతులు మాట్లాడుతూ ప్రభుత్వం తల్లి-బిడ్డలకు అందిస్తున్న కేసీఆర్ కిట్, ఆంగన్వాడీల ద్వారా పౌష్టిక ఆహారం వంటి అన్ని సంక్షేమ పథకాలను గర్బవతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స, ప్రసవం చేయించుకోవాలని, ముఖ్యమంత్రి కెసిఆర్ పాలనలో ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రైవేట్ ఆసుపత్రులకు ధీటుగా అన్ని వసతులు కల్పిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆంగాన్వాడీ మినీ సెంటర్ టీచర్ మంజుల, ఆశావర్కర్ విజయ, ఇతర గర్భవతులు, పిల్లలు పాల్గొన్నారు.


విద్యుత్ షాక్‌కు గురై పాడి గేదె మృతి



నవతెలంగాణ-వెల్దుర్తి.

విద్యుత్ షాక్‌కు గురై పాడి గేదె మృతి చెందిన సంఘటన మండల పరిధిలో చేరిలా గ్రామ శివారులో వ్యవసాయ పొలం వద్ద జరిగింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం చేరిలా గ్రామానికి చెందిన ఎర్రోళ్ల యాదగిరికి చెందిన పశువులను రోజు వారిలాగే ఆయన కొడుకు మేపడానికి అటువైపు కొట్టుకపోవడం జరిగిందన్నారు. రాత్రి కురిసిన వర్షానికి చుట్టుపక్కల భూమి బురదమయంగా ఉండడంతో పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వైపు నుంచి పాడి గేదె వెళుతున్న క్రమంలో ఎర్త్ వైర్ కు కరెంటు పాసై విద్యుత్ షాక్‌కు గురై పాడి గేదె మృతి చెందినట్లు తెలిపారు గేదె విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందన్నారు. తమ కుటుంబానికి జీవనాధారంగా ఉండేదని రోజు పాలు పిండి అమ్ముకొని కుటుంబం పోషించుకునే వారమని బాధితుడు యాదగిరి తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు

అనారోగ్యంతో ఉప సర్పంచ్ మృతి



నవతెలంగాణ -టేక్మాల్

టేక్మాల్ మండల పరిధిలోని కోరంపల్లి గ్రామ ఉపసర్పంచ్ కల్లు భాగమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం ఉదయం తెల్లవారుజామున మృతి చెందారు. విషయం తెలుసుకున్న మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు భక్తుల వీరప్ప మృతురాలు భాగ్యమ్మ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కోరంపల్లి గ్రామ సర్పంచ్ శ్రీనివాస్, బిఆర్ ఎస్ యువత కార్యదర్శి నాయికోటీ భాస్కర్, నాయకులు తదితరులు ఉన్నారు.